


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

09.08.2026

ఆదివారం |రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 40

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## యూపీఐపై ఎండీఆర్ చార్జీల విధింపుపై కేంద్రం క్లారిటీ

- కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపారులకు గుడ్‌న్యూస్
- వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం




**న్యూఢిల్లీ, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్**

ఇన్నాళ్లు ఫ్రీగా ఉన్న యూపీఐ లావాదేవీలపై ఇక ఛార్జీలు వసూలు చేస్తారనే చర్చ తీవ్రంగా సాగుతోంది. 2లో..

## జుట్టు పెంచుకుంటూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

**ఉత్తరాఖండ్, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్**

నెమలికి నాట్యం అందం స్త్రీలకు కురులు అందం. నల్లని ఒత్తైన కురులు అందాన్ని రెట్టింపు చేస్తాయి. అందుకే ప్రతిఒక్కరు జుట్టు పెంచుకునేందుకు, కేశ సంరక్షణ కోసం ఆరాటపడుతుంటారు. ఇదే రీతిలో ఉత్తరాఖండ్‌కు చెందిన రేణు ధారియాల్ తన అసాధారణమైన పొడవాటి జుట్టుతో ప్రపంచ రికార్డు సృష్టించారు. అత్యంత పొడవైన జుట్టు ఉన్న వ్యక్తిగా ఆమె గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. 2లో..



## ప్రమాదం తర్వాత 5 లక్షల అండ

ఆపద రాకముందే బీమా కవచం

ఆటో కార్మికుల కుటుంబాలకు..

కేటీఆర్ భరోసా

సొంత ఖర్చుతో బీమా చేయించారు

సిరిసిల్ల జిల్లాలోని ఆటో కార్మికులందరికీ



**సిరిసిల్ల, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్**

ఆటో కార్మికులకు కేటీఆర్ అండగా నిలిచారు. రోజంతా ఆటో నడుపుతూ కుటుంబాలను పోషించే వేలాది మంది ఆటో కార్మికుల కు ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్న పరిస్థితిని గుర్తించి, సిరిసిల్ల జిల్లాలోని ఆటో కార్మికులందరికీ తన సొంత ఖర్చుతో ప్రమాద బీమా చేయించారు. 2లో..

# బీజేపీ టార్గెట్ హరీష్ రావేనా?

గులాబీకి గుడ్‌బై చెప్పే సమయం ఆసన్నమా..?

2028పై కమలం మాస్టర్ ప్లాన్..!

హరీష్ వస్తే బీజేపీ బలం రెట్టింపేనా..?

బీఆర్ఎస్‌లో పెరుగుతున్న అసంతృప్తి..!

కాంగ్రెస్ కౌంటర్ వ్యూహం సిద్ధమా..?

తెలంగాణ రాజకీయాల్లో భారీ మార్పులకు కౌంట్‌డౌన్..?



**తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 7, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు జోరందుకున్నాయి. 2028 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగాలని భావిస్తున్న బీజేపీ, ప్రభావవంతమైన నాయకులను పార్టీలోకి తీసుకురావడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ క్రమంలో హరీష్ రావు పేరు ప్రధానంగా తెరపైకి వచ్చింది.

ప్రస్తుతం హరీష్ రావు బీజేపీలో చేరుతున్నారనే విషయంపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. అయినప్పటికీ ఈ ప్రచారం వెనుక ఉన్న రాజకీయ కారణాలపై విశ్లేషణలు సాగుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన హరీష్ రావు, పార్టీ ఓటమి తర్వాత గతంతో పోలిస్తే తక్కువగా కనిపిస్తున్నారని, కీలక నిర్ణయాల్లో ఆయనకు ఆశించిన స్థాయి ప్రాధాన్యం లభించడం లేదనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రాజకీయ నిర్ణయాలు మారే అవకాశాలను కొందరు విశ్లేషకులు కొట్టిపారేయడం లేదు. బీజేపీ కోణంలో చూస్తే హరీష్ రావు వంటి మాస్ లీడర్ చేరితే పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా రాజకీయంగా కొత్త ఉత్సాహం వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి మెదక్, సిద్ధిపేటతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పార్టీ బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందినi కొందరు నేతలు, కార్యకర్తలు కూడా ఆయన వెంట నడిచే పరిస్థితి ఏర్పడితే కమలం పార్టీకి సంస్థాగతంగా లాభం చేకూరవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఒక నాయకుడి చేరిక తోనే అధికారానికి దారి సుగమం అవుతుందనుకోవడం సరికాదని మరో వర్గం అభిప్రాయపడుతోంది. 2లో..

## ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దు

- యువతకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణం
- ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలి 5లో..
- ఐఐటీ ఢిల్లీ గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది
- బయటి ప్రపంచం చాలా వేగంగా మారుతోంది



**న్యూఢిల్లీ, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్**

దేశ యువతరం సామర్థ్యాలపై తమకు ఎంతో విశ్వాసం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా సాగే మన దేశ ప్రయాణానికి వారి అవసరం ఎంతో ఉందని తెలిపారు. అయితే, ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దని సూచించారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మోదీ ప్రసంగించారు.

## జార్ఖండ్‌లో పేపర్ లీక్ నిరసనలు

- ప్రభుత్వంతో చర్చలు విఫలం 2లో..
- ఆందోళన కొన సాగిస్తున్న విద్యార్థులు

**రాంచీ, ఆగస్టు 08, అనంత జనశక్తి న్యూస్**

జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అవకతవకలు జరిగాయంటూ అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం వివిధ విద్యార్థి సంఘాలు, నిరసనకారులతో వరుసగా చర్చలు జరిపింది. అయితే ఈ సమావేశాలతో ప్రతిష్ఠంభనకు తెరపడలేదు. తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దు

మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను..

పున:ప్రారంభిస్తామని వెల్లడి



**హైదరాబాద్, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్**

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, R&R కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. ఈరోజు (శనివారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. 2లో..

## నిరుద్యోగులను గౌరవించండి

- విద్యార్థులు, నిరుద్యోగులు అంటే..
- ఎందుకు ఇంత కక్ష రేవంత్ రెడ్డి?
- ఉద్యోగాలు ఇవ్వడం మీకు చేతకాదు
- మాజీ మంత్రి హరీశ్ రావు



**హైదరాబాద్, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్**

విద్యార్థులు, నిరుద్యోగులు అంటే మీ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష రేవంత్ రెడ్డి? అని మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల ప్రకటనకు సరూర్ నగర్ స్టేడియానికి నిరుద్యోగులు పోటెత్తారు. దీంతో నిరుద్యోగుల పట్ల అధికారులు దురుసుగా ప్రవర్తించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. 5లో..

## బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యం

- భారత స్వాతంత్ర్యం పోరాటంలో
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- అలాంటి వాళ్ల నుంచి దేశభక్తి పాఠాలు చెప్పున్నది



5లో..

## వైసీపీ నేరగాళ్ల ముఠా

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఫైర్
- బీసీలను గండెల్లో పెట్టుకుంటున్నాం
- ప్రజల ఆశలు నిలబెట్టుకుంటూ పాలిస్తున్నాం
- కుర్చీ కోసమే జగన్ అరాచక యాత్రలు



**అమరావతి ఆగస్టు 08, అనంత జనశక్తి ప్రతినిధి**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల నుంచి ఏపీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు రేయింబవళ్లు శ్రమిస్తుంటే, అధికారం కోసం తన క్రిమినల్ బ్యాచ్ తో జగన్ రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. 5లో..

## ఐఫోన్లు దోచేశారు

- తిరుపతి సోనోవిజన్‌లో భారీ చోరీ
- గోడకు కన్నమేసి దొంగతనం 5లో..
- 50 ఆపిల్ ఐఫోన్లు సహా 200 మొబైల్ ఫోన్లు



## కర్నూలులో ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ

- మెగా డీఎస్సీ 2025కు మద్దతుగా
- ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ 2లో..
- ప్లకార్డులు ప్రదర్శించిన ఉపాధ్యాయులు
- డీఎస్సీపై కుట్రలు చేయవద్దని ప్లకార్డులు



# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు



(మొదటి పేజీ తరువాయి)

మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు.

**రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి..**

2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తి పాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

# యూపీఐపై ఎండీఆర్ ఛార్జీల విధింపుపై కేంద్రం క్లారిటీ


(మొదటిపేజీ తరువాయి)

యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీల విధింపుపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయి. అమలులోకి వస్తే చిన్న వ్యాపారులు, కిరాణా దుకాణాలు, వీధి వ్యాపారులపై భారం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, దీనిపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది.

పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు, 2026, యూపీఐ వినియోగదారులు, వ్యాపారులు త్వరలో ఛార్జీలను ఎదుర్కోవచ్చనే ఊహాగానాలకు దారితీసిన నేపథ్యంలో ఈ స్పష్టత వచ్చింది. ప్రస్తుతం యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించే ప్రతిపాదన లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా ఛార్జీలు విధించినా వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పేమెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకారం, వినియోగించినందు యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీ వసూలు చేసే ప్రతిపాదన లేదని, అలాగే కిరాణా షాపులు, ఐస్ క్రీమ్ విక్రేతలు, చిన్న షాపుల వంటి వ్యాపారులు యూపీఐ ఉపయోగించినందుకు ఎండీఆర్ చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పింది. 2016లో ప్రారంభమైన యూపీఐ సేవలు ఉచితం కావడంతో వేగవంతంగా డిజిటల్ లావాదేవీలు విస్తరించాయి.

మర్చంట్ డిస్కౌంట్ రేట్ అనేది డిజిటల్ లావాదేవీలను ప్రాసెస్ చేసినందుకు వ్యాపారుల నుంచి బ్యాంకులు లేదా పెమెంట్ సర్వీస్ సంస్థలు వసూలు చేసే ఒక ఫీజు. సాధారణంగా ఇది వినియోగదారులు చెల్లించే ఛార్జీలు కావు. అయితే, వ్యాపారులపై ఎండీఆర్ భారం పెరిగితే డిజిటల్ చెల్లింపులు స్వీకరించడానికి వెనుకాడే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

మరోవైపు, ఈ ఎండీఆర్ ఛార్జీల ద్వారా పేమెంట్ మౌలిక సదుపాయాలు, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థల్ని డెవలప్ చేసేందుకు నిధులు సమకూరుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మర్చంట్ సర్వీస్ ఛార్జీలు అనేవి వ్యాపారులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల మధ్య జరిగే వాణిజ్య ఒప్పందాలకు సంబంధించినవని PCI తెలిపిందిlh








# ప్రమాదం తర్వాత 5 లక్షల అండ



(మొదటిపేజీ తరువాయి)

బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు బొమ్మనవేని రాజు సుమారు నాలుగు నెలల క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తిని కోల్పోయిన ఆ కుటుంబానికి తీవ్ర విషాదం నెలకొంది.కానీ రామన్న ముందుగానే చేయించిన ప్రమాద బీమా కారణంగా ఈరోజు రాజు కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందింది. రాజు కుటుంబం రోడ్డున పడకుండా రామన్న ముందుచూపు అండగా నిలిచింది. ఈ సందర్భంగా ఆటో కార్మికులు రామన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కోసం సొంత ఖర్చుతో ప్రమాద బీమా చేయించి, ప్రమాదం జరిగిన కుటుంబానికి అండగా నిలిచిన కేటీఆర్ మానవత్వాన్ని వారు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బొల్లి రామ్మోహన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలిశ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మణరావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచులు కొండ రమేష్, అందె సుభాష్, ఎలగందుల నరసింహులు తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# కర్నూలులో ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ






**కర్నూలు, ఆగస్టు 08, అనంత జనశక్తి న్యూస్**

మెగా డీఎస్సీ 2025కు మద్దతుగా కర్నూలులో ఉపాధ్యాయులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో కర్నూలుకు చేరుకున్న టీచర్లు.. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం అక్కడి నుంచి జెడ్పీ కార్యాలయం దాకా ఆత్మగౌరవ ర్యాలీ చేపట్టారు. డీఎస్సీ 2025 నియామకాలపై కుట్రలు చేయొద్దంటూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. మెగా డీఎస్సీపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు వాస్తవాలు వివరిస్తున్నా.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మండిపడ్డారు. డీఎస్సీ 2025పై కుట్రలు చేసిన వారికి తగిన గుణపాఠం చెప్తామంటూ హెచ్చరించారు.

మరోవైపు 2025 డీఎస్సీలో అక్రమాలు జరిగాయని విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఆరోపిస్తోంది. స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయుల ఉద్యోగుల భర్తీలో అక్రమాలు జరిగాయని.. ఉద్యోగాలను అమ్ముకున్నారంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం పలుమార్లు ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఇందుకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే డీఎస్సీ అక్రమాలపై విచారణ జరిపించాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ఇదే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు చేపడుతోంది.

అయితే2025 డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టినట్లు ఏపీ విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. డీఎస్సీపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి క్లారిటీ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం కూడా ఏపీ విద్యాశాఖ అధికారులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఏపీ డీఎస్సీ 2025ను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని.. అభ్యర్థుల సందేహాలపై ఇప్పటికే మూడుసార్లు విలేకర్ల సమావేశాల ద్వారా క్లారిటీ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అయినా కూడా ఆరోపణలు చేస్తున్నారని.. ఎవరికైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.





# బీజేపీ టార్గెట్ హరీష్ రావేనా?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో బీజేపీకి ఇంకా గ్రామీణ స్థాయిలో బలమైన కేడర్, విస్తృత నాయకత్వం అవసరమని, హరీష్ రావు చేరినా పార్టీని అధికారానికి చేర్చాలంటే మరిన్ని సామాజిక, రాజకీయ సమీకరణాలు కలిసి రావాల్సిందేనని విశ్లేషిస్తున్నారు. ఇక బీఆర్ఎస్‌కు ఇది పెద్ద సవాలుగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే పార్టీ ఓటమి తర్వాత కేడర్‌ను నిలబెట్టుకోవడంపై దృష్టి పెట్టిన అధిష్ఠానానికి హరీష్ రావు వంటి కీలక నాయకుడి భవిష్యత్తుపై వస్తున్న ప్రచారం ఇబ్బందికరంగా మారవచ్చని అంటున్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా పార్టీ అంతర్గత అసంతృప్తిని తగ్గించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనించే అవకాశం ఉంది. బీజేపీ బలపడకుండా రాజకీయంగా ఎదురుదాడి చేయడం, బీఆర్ఎస్‌లో అసంతృప్త నేతలను తమవైపు తిప్పుకోవడం, రెండు పార్టీలపై ఒకేసారి రాజకీయ విమర్శలు గుప్పించడం వంటి వ్యూహాలను కాంగ్రెస్ అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీగా అభివృద్ధి, సంక్షేమం, పరిపాలన అంశాలను ముందుకు తెచ్చి ప్రతిపక్షాలను రక్షణాత్మక స్థితిలోకి నెట్టే ప్రయత్నం చేయవచ్చని భావిస్తున్నారు. హరీష్ రావు వ్యక్తిగత రాజకీయ బలం, ప్రజల్లో ఉన్న ఆదరణ, పరిపాలనా అనుభవం బీజేపీకి ఉపయోగపడే అంశాలే అయినప్పటికీ, తెలంగాణ రాజకీయాల్లో తుది ఫలితాలను నిర్ణయించేది కేవలం నాయకుల పార్టీ మార్పులు మాత్రమే కావని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. కుల, ప్రాంతీయ సమీకరణాలు, కేడర్ బలం, ఎన్నికల నాటికి నెలకొనే రాజకీయ పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.



# జార్ఖండ్‌లో పేపర్ లీక్ నిరసనలు



(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ తొలుత జార్ఖండ్ లోక్ జనశక్తి మోర్చా నేత దేవేంద్ర నాథ్ మహతో నేతృత్వంలోని నిరసనకారుల వర్గంతో సమావేశమైంది. పేపర్ లీక్ వ్యవహారంపై మహతో చేపట్టిన నిరాహార దీక్ష ఏడో రోజుకు చేరుకుంది. అనంతరం కాంగ్రెస్ మద్దతు ఉన్న ఎన్ఎస్‌యూఐ, ఆదివాసీ ఛాత్ర సంఘ్, జార్ఖండ్ ఛాత్ర మోర్చా ప్రతినిధులతో కమిటీ వేర్వేరుగా చర్చలు జరిపింది. శుక్రవారం రాత్రి కూడా 10 మంది సభ్యుల ప్రతినిధి బృందంతో ప్రభుత్వం చర్చలు నిర్వహించింది.

వరుస సమావేశాల అనంతరం ప్రభుత్వ కమిటీ సభ్యుడు, రాష్ట్ర మంత్రి సంజయ్ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. నిరసనకారుల డిమాండ్లు న్యాయమైనవేనని తెలిపారు. వాటిని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అధికార జేఎంఎం విద్యార్థి విభాగమైన జార్ఖండ్ ఛాత్ర మోర్చా ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లను ఉంచింది. వీటిలో 14వ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్న NSUI ప్రభుత్వం ముందు ఆరు డిమాండ్లను ఉంచింది. అనుమానాస్పదంగా ఉన్న అన్ని JPSC, JSSC పరీక్షలపై 90 రోజుల్లోపు CID దర్యాప్తు చేపట్టాలని కోరింది. అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తరహాలో జార్ఖండ్ టెస్టింగ్ ఏజెన్సీను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

ఆదివాసీ ఛాత్ర సంఘ్ నేత కార్తిక్ ఓరావ్ మాట్లాడుతూ.. నియామక పరీక్షల్లో గిరిజన, ప్రాంతీయ భాషలను క్వాలిఫైయింగ్ పేపర్లుగా చేర్చాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అవకతవకలు జరిగినట్లు గుర్తించిన పరీక్షలను రద్దు చేయాలని కూడా కోరినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ కమిటీ తొలుత దేవేంద్రనాథ్ మహతో వర్గానికి చెందిన విద్యార్థుల సంఘంతో దాదాపు రెండు గంటల పాటు సమావేశమైంది. తమ సమస్యలను పరిష్కరించేందుకు త్వరగా నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఫోరం నేత తెలిపారు. అయితే 14వ JPSC పరీక్ష రద్దుతో పాటు తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చే వరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# జుట్టు పెంచుకుంటూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

(మొదటిపేజీ తరువాయి)

రేణు ధారియాల్ జుట్టు పొడవు ఏకంగా 271.50 సెంటీమీటర్లు (8 అడుగుల 10 అంగుళాలు)గా నమోదైంది. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఏప్రిల్‌లో నిర్వహించిన కొలతల అనంతరం ఈ రికార్డును ధృవీకరించారు.

**ఉక్రెయిన్ మహిళ రికార్డును అధిగమించిన రేణు**

రేణు ధారియాల్ సాధించిన ఈ రికార్డుకు ముందు ఉక్రెయిన్‌కు చెందిన అలియా నసిరోవా పేరుతో ఈ రికార్డు ఉండేది. ఆమె జుట్టు పొడవు 257.33 సెంటీమీటర్లు (8 అడుగుల 5.3 అంగుళాలు)గా నమోదైంది. అలియా రికార్డుతో పోలిస్తే రేణు జుట్టు దాదాపు 14 సెంటీమీటర్లు ఎక్కువగా ఉంది. రేణు జుట్టు పొడవు ప్రపంచంలోనే అత్యంత పొడవైన వ్యక్తిగా నమోదైన రాబర్ట్ వాడ్లో ఎత్తుకు కూడా చాలా దగ్గరగా ఉండటం విశేషం. రాబర్ట్ వాడ్లో ఎత్తు 272 సెంటీమీటర్లు (8 అడుగుల 11.1 అంగుళాలు)గా నమోదైంది.

**2015 నుంచి జుట్టు కత్తిరించుకోలేదట**

రేణు ధారియాల్ దాదాపు పదేళ్లుగా జుట్టును పెంచుతున్నారు. 2015 నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా జుట్టును కత్తిరించుకోలేదని ఆమె తెలిపారు. కంటెంట్ క్రియేటర్, యూట్యూబర్‌గా కూడా రేణు పనిచేస్తున్నారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జుట్టు సంరక్షణ, అందానికి సంబంధించిన చిట్కాలను పంచుకుంటున్నారు. ముఖ్యంగా సహజసిద్ధమైన ఉత్పత్తులతో జుట్టును ఎలా సంరక్షించుకోవాలో ఆమె తన ఫాలోవర్లకు వివరిస్తుంటారు.

**భారతీయ సంస్కృతే ప్రేరణ**

పొడవాటి జుట్టు పెంచుకోవడానికి భారతీయ సంస్కృతే తనకు ప్రేరణగా నిలిచిందని రేణు తెలిపారు. భారతీయ సంస్కృతిలో పొడవాటి జుట్టును అందం, సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారని, అందుకే తాను జుట్టును ఇంత పొడవుగా పెంచాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 2015 నుంచి జుట్టును నిరంతరం పెంచుతున్నానని, అప్పటి నుంచి కత్తిరించలేదని ఆమె వెల్లడించారు.

**నేలపై పరుచుకునేంత పొడవైన జుట్టు**

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ విడుదల చేసిన ఫొటోల్లో రేణు జుట్టు పొడవు ఎంత అసాధారణంగా ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని ఫొటోల్లో ఆమె జుట్టు నేలపై చాలా దూరం వరకు పరుచుకుని కనిపిస్తుండగా, మరికొన్ని చిత్రాల్లో మంచం అంచు మీదుగా జుట్టు కిందికి వేలాడుతూ కనిపించింది. కూర్చున్న సమయంలో కూడా ఆమె జుట్టు చుట్టూ భారీగా కనిపిస్తుంది. ఇంత పొడవు ఉన్నప్పటికీ జుట్టు మందంగా, ఆరోగ్యంగా, మెరిసేలా కనిపించడం మరో విశేషం. రోజువారీ పనులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రేణు తన జుట్టును జడగా అల్లుకుంటారు.

**జుట్టు సంరక్షణకు గంటల సమయం**

ఇంత పొడవాటి జుట్టును సంరక్షించడం అంత సులభం కాదు. జుట్టును శుభ్రం చేయడం, చిక్కులు తొలగించడం వంటి పనులకు చాలా సమయం, సహనం అవసరమని రేణు చెబుతున్నారు. తన జుట్టు సంరక్షణ కోసం రసాయన ఆధారిత ఉత్పత్తులను దూరంగా ఉంచుతున్నానని ఆమె తెలిపారు. ఇంట్లోనే తయారు చేసుకునే సహజమైన హెయిర్ ఆయిల్స్, షాంపూలను ఉపయోగిస్తానని, వాటి తయారీ విధానాలను కూడా తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఫాలోవర్లతో పంచుకుంటానని చెప్పారు.





# రాహుల్‌గాంధీ వైఖరి మారినట్లుంది.. కేంద్రమంత్రి కిరెణ్ రిజుజు



మహిళల స్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలని అన్నారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ లో ఈ అంశంపై మరింత వివరంగా పేర్కొన్నారు. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళల్లో ఉన్న శక్తి పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదని రాహుల్ అన్నారు. మహిళలు తమకు నచ్చిన విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాలని చెప్పారు. ఇళ్లలో, కుటుంబాల్లో, సమాజంలో తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యులు అంగీకరించని విషయాలపై కూడా మహిళలు తమ అభిప్రాయం చెప్పగలగాలని అన్నారు. పురుషుల ఆధిపత్యం నుంచి మహిళలకు కొంత స్వేచ్ఛ అవసరమని చెప్పారు.

అప్పుడే దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని రిజిజు అన్నారు. 'మహిళల విషయంలో రాహుల్‌గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నా' అని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా ఈ చట్టం ఉంది. అయితే దీని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరం. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లును తిరిగి తీసుకొచ్చేందుకు విపక్షాల మద్దతును ప్రభుత్వం కోరుతోంది. రాహుల్‌గాంధీతో గురువారం రిజిజు ఫోన్‌లో మాట్లాడారు. బిల్లును త్వరగా తీసుకొస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగంగా జరిగే అవకాశం ఉందని అన్నారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు కాకపోతే వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని చెప్పినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2026 రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందలేదు. ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టే అంశంపై ప్రభుత్వం, విపక్షాల మధ్య చర్చ కొనసాగుతోంది.

# ఏఎస్ఐగా ఓ మహిళ నకిలీ అవతారం..

**- ఆమెను పట్టించిన టిఫిన్ బాక్సు**

పంజాబ్ పోలీసులు ఓ నకిలీ మహిళా ఏఎస్ఐని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల పాటు ఆమె పోలీసు దుస్తుల్లో హల్‌చల్ చేసింది. ఫిరోజ్‌పూర్‌లో ఆమెను మోఘా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందిత వ్యక్తిని కోమల్‌ప్రీత్ కౌర్‌గా గుర్తించారు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని మాలేవాలా గ్రామం ఆమెది. తనకు తాను ఓ పోలీసులా ఆమె గెటప్ వేసుకున్నది. సామాజికంగా గుర్తింపు పొందేందుకు పోలీసు శాఖలో ఏఎస్ఐగా చేస్తున్నట్లు చెప్పుకున్నది. అయితే ఓ మంచి కుటుంబం నుంచి అబ్బాయిని పెళ్లి చేసుకునేందుకు ఆమె పోలీసు వేషం వేసినట్లు తెలిసింది. నెల క్రితం ఓ వ్యక్తిని కూడా ఆమె పెళ్లాడింది. తప్పుడు గుర్తింపుతోనే ఆ పెళ్లి చేసుకున్నది.

అయితే ఇంటి నుంచి రెగ్యులర్‌గా తెచ్చుకునే టిఫిన్ బాక్సు ఆమెను పట్టించింది. పోలీసు అని చెప్పుకుంటున్న కోమల్‌ప్రీత్ ప్రతి రోజు టిఫిన్ బాక్సును తీసుకువచ్చేది. మోఘా సిటీ 1 పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న సంజ్ కేంద్ర వద్దకు వెళ్లి అక్కడ తన టిఫిన్ బాక్సును పెట్టేది. స్థానిక పోలీసులు కూడా తమ బాక్సులను అక్కడే పెట్టేవాళ్లు. అయితే మెయిన్ చౌక్ వద్ద ట్రాఫిక్



డ్యూటీ చేస్తున్నానని ఆమె చెప్పుకునేది. ఇక ఓ గంట తర్వాత తిరిగివచ్చి, తన టిఫిన్ బాక్సును తీసుకుని వెళ్లేది. కానీ టిఫిన్ కోసం వచ్చే సమయంలో నిజమైన పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. డ్యూటీ రోస్టర్‌లో ఆ పేరుతో ఎవరూ లేరు కాదా అన్న డౌట్‌లో ఉండేవారు.

రోజురోజుకూ ఆమెపై అనుమానాలు పెరిగిపోవడంతో.. తన బ్యాచ్ ఏంటి, పోస్టింగ్ డిటేల్స్, సీనియర్ ఆఫీసర్లు ఎవరు అని అడిగేవారు. ఆమె ఇచ్చే సమాధానాలు అక్కడి పోలీసులను సంతృప్తి పరిచేది కాదు. దీంతో ఆమె గురించి లోతుగా ఆరా తీయడం మొదలుపెట్టారు. సెర్చింగ్‌లో ఆమె నుంచి పంజాబ్ పోలీసు యూనిఫామ్‌ను గుర్తించారు. రెండు వాకీ టాకీ సెట్లను, డిపార్ట్‌మెంట్ ఐడీ కార్డును ఆమె నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆమె ధరించే యూనిఫాం.. అఫీషియల్‌గా ఉండేది. వాకీటాకీలు కూడా అఫిషియల్‌గా ఉన్నాయి. ఐడీ కార్డు కూడా ఒరినల్‌గా ఉండడంతో మొదట్లో ఎవరికీ అనుమానాలు రాలేదు. కానీ డ్యూటీ రోస్టర్‌లో ఆమె పేరు లేకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది.

రెండు నెలల పాటు కోమల్‌ప్రీత్ తన పని తాను చేసుకుని పోయింది. ఓ పోలీసు ఆఫీసర్‌గా తనను తాను ప్రొజెక్టు చేసుకోవాలన్న ఉద్దేశం ఆమెకు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమాజంలో గుర్తింపు పొంది, ఓ మంచి కుటుంబానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలన్న తపన ఆమె ఉండేదని తేల్చారు. ఆమె నటన బాగానే ఉన్నా.. డ్యూటీ రోస్టర్‌లో పేరు లేకపోవడంతో ఆమెపై ఫోకస్ పెట్టాల్సి వచ్చింది. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. నకిలీ వేషం, ఫోర్జరీ, అధికార గుర్తుల దుర్వినియోగం కింద కేసు నమోదు చేశారు. అయితే తన పోలీసు లుక్‌తో కోమల్‌ప్రీత్ ఎవరి నుంచైనా ఆర్థికంగా లాభపడిందా అన్న కోణంలోనూ విచారిస్తున్నారు.

# బెంగళూరు ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు..

**- కిచెన్‌లో కుళ్లిన కూరగాయలు, మాంసం**

కర్ణాటక రాజధాని బెంగళూరులోని లగ్జరీ, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టగా దారుణ విషయాలు బయటపడ్డాయి. హోటళ్లలో కుళ్లిన కూరగాయలు, మాంసం, ఎక్స్‌పైరీ అయిన పాలు, ఫంగస్ సోకిన ఆహార పదార్థాలు లభ్యమయ్యాయి. పలు హోటళల్లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు ఏమీ పాటించట్లేదనే విషయం వెల్లడైంది. అనేక చోట్ల నిబంధనలు ఉల్లంఘించిన పరిస్థితులే ఉన్నాయి. కర్ణాటకకు చెందిన ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన అధికారులు బెంగళూరు అర్బన్ జిల్లాలోని అనేక స్టార్ హోటళ్లలో తాజాగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీలు నిర్వహించారు.

30 టీంలు ఇందుకోసం పని చేస్తున్నాయి. ఈ విషయాన్ని కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి యూటీ ఖాదర్ కూడా వెల్లడించారు. తాజ్ యెశ్వంత్‌పూర్, షాంగ్రి లా బెంగళూరు వంటి ప్రముఖ త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 26 హోటళ్లను తనిఖీ చేయగా, అనేక చోట్ల తీవ్రమైన ఉల్లంఘనలు కనిపించాయి. సాధారణంగా స్టార్ హెటల్స్ అనగానే.. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటిస్తారు అనుకుంటారు. కానీ, ఇక్కడ చాలా చోట్ల కనీస ప్రమాణాలు పాటించట్లేదని, పాడైన, ఎక్స్‌పైరీ డేట్ దాటిపోయిన కూరగాయలు, మాంసం, పాలు, ఇతర తయారు చేసిన పదార్థాలనే వాడుతున్నట్లు తేలింది. ఈ హోటళ్ల నుంచి చికెన్, మటన్, చేపమాంసం, ఆయిల్, పాలు, మసాలాలు, టీ పౌడర్, చీజ్, సాసెస్ వంటి అనేక పదార్థాల శాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షల కోసం ల్యాబొరేటరీకి పంపించారు. అనేక హోటళ్లలో కిచెన్‌లో పారిశుధ్యం లోపించినట్లు గుర్తించారు. అలాగే, కుళ్లిన కూరగాయల్ని వాడుతున్నారు. ఎప్పుడో తయారు చేసిన ఆహార పదార్థాలు పాడైనప్పటికీ వాటిని మళ్లీ వినియోగిస్తున్నారు. కొన్నింటికి ఫంగస్ సోకి ఉంది.

ఆహార పదార్థాల నిర్వహణ, భద్రత కూడా సరిగ్గా లేదు. కొన్ని పదార్థాలపై తప్పుడు లేబుల్స్ ఉన్నాయి. అలాగే, శాకాహార, మాంసాహారాన్ని ఒకే చోట కలిపి ఉంచారు. నిబంధనలకు ఇది విరుద్ధం. వెజ్,




నాన్‌వెజ్ ఐటమ్స్ వేర్వేరుగా ఉంచాలి. లలిత్ అశోక్ హోటల్ నుంచి 76 కేజీల మాంసం, 200 కేజీల కూరగాయలు, 32 లీటర్ల పాలు పాడైనట్లు గుర్తించి, వాటిని నాశనం చేశారు. వివాంటా బెంగళూరు, షాంగ్రి లా బెంగళూరు, తాజ్ యెశ్వంత్‌పూర్ వంటి ప్రముఖ హోటళ్లలో కూడా కుళ్లిన మాంసం, కూరగాయలు, పాలు, బేకరి ఐటమ్స్ గుర్తించి ధ్వంసం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఈ హోటళ్లు అన్నింటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.


# కొనసాగిన ప్రతిష్టంభన

**- అమిత్ షా రావాల్సిందేనంటూ పార్లమెంటులో విపక్షాల నిరసనలు**

**- ఉభయ సభలు సోమవారానికి వాయిదా**

పార్లమెంటులో మళ్లీ అదే ప్రతిష్టంభన! విద్యార్థులపై పోలీసుల బలప్రయోగం, నీట్ పేపర్ లీక్, అయోధ్యలో విరాళాల స్వాహా వంటి అంశాలపై విపక్షాలు ఆందోళన కొనసాగించడంతో ఉభయ సభల్లో శుక్రవారం కూడా చర్చలేవీ జరగలేదు. గత నెల 20న దిల్లీలో విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా వివరణ ఇవ్వాలని రాజ్యసభలో, లోక్‌సభలో ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. విపక్షాల ఆందోళనల మధ్యే.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి (సవరణ) బిల్లు 2026ను లోక్‌సభ ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించింది. రాజ్యసభలో ఈ బిల్లుకు ఈ నెల 3నే ఆమోద ముద్ర పడింది. ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

రాజ్యసభ కార్యకలాపాలు శుక్రవారం ప్రారంభమవగానే.. అమిత్ షా సభకు రావాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలో విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. ఆయన సభకు ఎందుకు రావట్లేదని ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. నిరసనలు కొనసాగడంతో సభ సోమవారానికి వాయిదా పడింది. అమిత్ షా స్పందన డిమాండ్ చేస్తూ లోక్‌సభలోనూ విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ మంత్రి సభకు రావాలి, దేనికి స్పందించాలి అనే విషయాలను ప్రతిపక్షాలు ఎలా నిర్దేశిస్తాయని ప్రశ్నించారు.




**ఓం బిర్లాతో అమిత్ షా భేటీ**

విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి అమిత్ షా సమాధానం చెప్పాల్సిందేనంటూ పార్లమెంటు కార్యకలాపాలను విపక్షాలు అడ్డుకుంటున్న నేపథ్యంలో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. స్పీకర్ ఓం బిర్లాతో అమిత్ షా సమావేశమయ్యారు.

# ఇంట్లో మహిళ అస్థిపంజరం.. ఏడాది క్రితమే మృతి!

**బెంగళూరులోని ఓ ఇంట్లోమహిళ అస్థిపంజరం లభ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. బగలగుంటె ప్రాంతంలో ఉన్న ఒక డూప్లెక్స్‌లో నివసిస్తున్న మహిళ.. చాలా కాలంగా కనిపించట్లేదని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి పరిశీలించారు. ఇంట్లో ఓ మహిళ అస్థిపంజరం కనిపించడంతో షాక్ అయ్యారు. దాదాపు సంవత్సరం క్రితమే ఆమె మరణించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఏడాదిగా ఆమె మృతదేహాన్ని ఎవరూ గుర్తించకపోవడం గమనార్హం.**

**మృతురాలిని అదే భవనంలో ఒంటరిగా నివసిస్తున్న 52 ఏళ్ల దాక్షాయణిగా గుర్తించారు. ఆమె భర్త ఉమేశ్ సుమారు పదేళ్ల క్రితం మరణించగా..ఆ తర్వాత క్యాన్సర్ బారిన పడి ఆమె కుమారుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కొన్నేళ్లుగా దాక్షాయణి తీవ్ర మానసిక కుంగుబాటుతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆమెకు ఓ కుమార్తె, అల్లుడు ఉన్నారని.. వారు ఆమెను చూడడానికి ఎప్పుడూ ఇంటికి వచ్చేవారు కాదని స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు**



**చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.**

# మెర్సిడీజ్ ఢీకొట్టడంతో 70 ఏళ్ల వృద్ధ మహిళ మృతి



వాగన్‌ఆర్ కారును మెర్సిడీజ్ ఢీకొన్న ఘటనలో 70 ఏళ్ల వృద్ధ మహిళ చనిపోయింది. ఢిల్లీలోని నరేలా ప్రాంతంలో ఉన్న హిమాలయాస్ అపార్ట్‌మెట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతురాలిని ఊర్మిళగా గుర్తించారు. మామూర్‌పుర్ ఆమె స్వంత నివాసం. రెండు వాహనాల మధ్య ఆమె ట్రాప్ అయినట్లు తెలిసింది. ప్రమాద స్థలంలోనే ఆమె ప్రాణాలు విడిచింది. వాగన్‌ఆర్ నడుపుతున్న డ్రైవర్ ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. అతనికి చికిత్స అందిస్తున్నారు. ఇక మెర్సిడీజ్ కారు డ్రైవ్ చేస్తున్న శుభమ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హర్యానా పోలీసు శాఖలో అతని తండ్రి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మెర్సిడీజ్ కారు నుంచి ఓ బీర్ బాటిల్‌ను రికవరీ చేశారు. మద్యం మత్తులో శుభమ్ కారును డ్రైవ్ చేసినట్లు స్థానికులు చెప్పారు. ఈ ఘటనకు దారి తీసిన అంశాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యాక్సిడెంట్ కేసును నమోదు చేశారు. ఊర్మిళ మృతదేహాన్నిపోస్టుమార్టమ్‌కు పంపారు.

# ట్రంప్ ఒత్తిడితో అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు: కేజ్రీవాల్



: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి మేరకు ఆ దేశం నుంచి భారీగా ఇథనాల్ దిగుమతి చేసుకునేందుకే కేంద్రంలోని భాజపా సర్కారు ఈ20 ఇంధన మిశ్రమ విధానాన్ని అమలు చేస్తోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. గోవాలోని పణజీలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలను ఏమాత్రం మెరుగుపరచకుండా, మార్కెట్‌లో ఉన్న వాహనాలు ఈ ఇంధనానికి అనుకూలంగా ఉండేలా చూడకుండా కేంద్రం బలవంతంగా ఈ విధానాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. ''మోదీ సర్కారు ట్రంప్ ఒత్తిడిని తట్టుకోలేకపోతోంది. ఇథనాల్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న అమెరికాయే దానిని పూర్తిగా వాడుకోలేకపోతోంది. అమెరికన్ ఇథనాల్‌కు డిమాండు సృష్టించేందుకే భారత్ ఈ కొత్త ఇంధన విధానాన్ని అమలుచేస్తూ ఆ దేశం నుంచి భారీ దిగుమతులు చేసుకుంటోంది'' అని కేజ్రీవాల్ విమర్శించారు.

గతేడాది అమెరికా నుంచి వంద కోట్ల లీటర్ల ఇథనాల్‌ను దిగుమతి చేసుకున్న భారత్.. ఈ ఏడాది దానికి అయిదు రెట్లు దిగుమతి చేసుకోబోతోందన్నారు. ఈ20 ఇంధన విధానాన్ని అమెరికాలోనే దేశవ్యాప్తంగా అమలుచేయడం లేదని, కేవలం మూడేళ్ల గడువు ఇచ్చి మనం దేశమంతా అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీన్ని ఇలాగే కొనసాగిస్తూ ప్రభుత్వం ఈ30, ఈ40 విధానాలను కూడా అమలు చేయవచ్చని, తన దీర్ఘకాలిక విధానాన్ని సర్కారు స్పష్టంగా ప్రకటించే వరకు ప్రజలు పెట్రోలు, డీజిలు వాహనాలపై పెట్టుబడి పెట్టవద్దని కేజ్రీవాల్ కోరారు. ఈ20 విధానానికి వ్యతిరేకంగా ఆప్ దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ పిటిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

# నాకు నచ్చిన మీమ్స్ మోదీ వీడియోలే: రాహుల్



యువతకు మరింత చేరువయ్యే ప్రయత్నంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ''ఆస్క్ మీ ఎనీథింగ్'' పేరిట ఒక లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్యమాల నుంచి వ్యక్తిగత అభిరుచుల వరకు నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కొన్నింటికి హాస్యంగా, మరికొన్నింటికి రాజకీయంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో ఒక నెటిజన్ ''మీరు బ్యాట్‌మ్యానా?'' అని ప్రశ్నించగా.. ''నన్ను, బ్యాట్‌మ్యాన్‌ను ఒకే గదిలో ఎవరూ చూడలేదు కదా'' అంటూ రాహుల్ చమత్కరించారు. ఆ కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విద్యార్థుల నిరసనల గురించి అడిగిన ప్రశ్నకు స్పందించిన రాహుల్ గాంధీ, విద్యార్థులు ఏమి చెబుతున్నారో వినాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. విద్యార్థుల ఆందోళనల్లో తనకు నచ్చిన మీమ్ ఏదన్న ప్రశ్నకు వ్యంగ్యంగా స్పందిస్తూ.. ''అర్ధరాత్రి ప్రధానమంత్రి నివాసం నుంచి వచ్చిన వీడియోలే ఉత్తమమైనవి. అవి ఆందోళనలో ఉన్న కొత్త ప్రధానమంత్రిని చూపించాయి'' అని వ్యాఖ్యానించారు. లైవ్ సెషన్‌లో ఆయన తన తల్లి సోనియా గాంధీ పెంపుడు కుక్క 'నూరీ'ని కూడా ప్రేక్షకులకు పరిచయం చేశారు. భాజపాలో మీకు ఇష్టమైన నాయకుడు ఎవరు? అని ప్రశ్నించగా.. 2022లో కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరిన పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ పేరు చెప్పారు.

# న్యాయవాది ఇంట్లోకి రెండోసారి చొరబడి.. రూ.3.15 కోట్లు దోపిడీ

ఓ న్యాయవాది ఇంట్లోకి రెండోసారి చొరబడిన దొంగలు రూ.3.15 కోట్ల విలువైన డబ్బు, నగలు దోపిడీ చేశారు. ఈ ఘటన హరియాణా లోని కురుక్షేత్రలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి 10 గంటల సమయంలో కురుక్షేత్రలోని సీనియర్ న్యాయవాది బల్వంత్ సింగ్ వాలియా ఇంట్లోకి చొరబడిన నలుగురు దొంగలు తుపాకితో ఆయన భార్యను బెదిరించి.. కాళ్లు చేతులు కట్టేశారు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన న్యాయవాదిని కూడా చుట్టుముట్టి బంధించారు. దంపతులపై దాడి చేసి ఇంట్లోని నగలు, నగదు ఇవ్వాలని తుపాకితో బెదిరించారు. వారి నుంచి తాళాలు తీసుకొని.. నగదు, బంగారం, వెండి ఆభరణాలు, లైసెన్స్ ఉన్న ఓ రివాల్వర్, ఇతర విలువైన వస్తువులను దోచుకున్నారు. ఈ ఏడాది మార్చిలో ఆ ఇంట్లో జరిగిన రూ.50 లక్షల దొంగతనం కూడా తామే చేశామని చెప్పినట్లు బల్వంత్ సింగ్ పేర్కొన్నారు. అంతే కాకుండా మరో రూ.80 లక్షలు డిమాండ్ చేశారని.. మళ్లీ వస్తామని హెచ్చరించారని తెలిపారు. వెళ్లే ముందు దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.




# లీకులు బోలెడు... శిక్షలే అరుదు!

పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు వస్తాయో.. అన్నింటికీ జవాబులు రాయగలమో లేదో.. మంచి స్కోర్ వస్తుందో రాదో అని విద్యార్థులు ఒకప్పుడు కిందమీదులయ్యేవారు. ఎగ్జామ్ హాల్‌లో ప్రశ్నపత్రం చేతికొచ్చేవరకూ అదే ఆలోచనతో ఉండేవారు. అక్కడ తెలిసిన ప్రశ్నలు కనిపిస్తేగానీ, వారి మనసు స్థిమితపడేది కాదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జీవితాలను పణంగా పెట్టి పరీక్షల గండాలను దాటాల్సి వస్తోంది. చెప్పిన సమయానికి పరీక్ష జరుగుతుందో లేదో... ఎప్పుడు ఏ పేపర్ ముందే బయటికొచ్చి ఎగ్జామ్ వాయిదాపడుతుందో అర్థంకాని పరిస్థితిలో పిల్లలు అల్లాడుతున్నారు. తిండీతిప్పలు మాని పుస్తకాలతో కుస్తీపట్టి ఎలాగో పరీక్ష రాసినా మూల్యాంకనం సరిగ్గా చేస్తారో, పేపర్లు ఎక్కడైనా లీక్ అయ్యి ఎగ్జామ్ మొత్తం రద్దు అయిపోతుందా అన్న సందేహాలు నేటి విద్యార్థులను నిత్యం ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితులను నివారించేందుకు లీకేజీల బాధ్యులకు శిక్షలను మరింత కఠినతరం చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు సంబంధించిన సవరణ బిల్లు ముసాయిదాకు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటును అది ప్రతిపాదించింది. యువతరం ఆవేదనను అర్థంచేసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమే. కానీ, లోపభూయిష్టమైన దర్యాప్తులను వాటంగా మార్చుకుని మళ్లీ మళ్లీ అవే పాతకాలకు ఒడిగడుతున్న ప్రబుద్ధులకు లోటులేని మన దేశంలో మార్పు ఎంతవరకు వస్తుందన్నది కీలక ప్రశ్న!

సాధారణంగా ఓ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఉద్యోగమో, కోరుకున్న కోర్సులో సీటో దక్కి జీవితం మారుతుందని, కష్టాలు తీరతాయని చాలామంది భావిస్తుంటారు. దీన్ని ఆసరా చేసుకుని కాసుల కక్కుర్తితో కొందరు దుర్మార్గులు విచ్చలవిడిగా పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నారు. అడ్డదారుల్లోనైనా బిడ్డలను అందలాలు ఎక్కించాలని ఆశపడుతున్న కొంతమంది తల్లిదండ్రులు సైతం లీకేజీలను ప్రోత్సహిస్తూ సామాజిక ద్రోహానికి పాల్పడుతున్నారు. పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసెక్కాలు ఆడిందన్నట్లు... పేరుకు బలమైన చట్టాలున్నా, వాటి అమలులో లోపాల వల్లే దోషులకు సకాలంలో శిక్షలు పడటంలేదు. ఆ ధీమాతోనే పాపాలభైరవులు పేట్రేగుతున్నారు. ముఖ్యంగా పేపర్ లీకేజీ కేసుల్లో ఎందరికి శిక్షలు పడుతున్నాయని పరిశీలిస్తే, మన వ్యవస్థలోని కంతలన్నీ బట్టబయలవుతాయి.

ఒక పరిశీలన ప్రకారం 2002-25 మధ్య ఆసేతుహిమాచలం లక్ష మందికి పైగా అభ్యర్థులు హాజరైన పరీక్షల్లో 45సార్లు పేపర్లు లీక్ అయ్యాయి. వాటిలో వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షలతోపాటు సర్కారీ కొలువుల భర్తీకి సంబంధించినవీ ఉన్నాయి. ఆయా కేసులన్నింటి మీదా కలిపి 1,658 మంది అరెస్టయ్యారు. వారిలో 925 మందిపైనే అభియోగాలు నమోదయ్యాయి. సరే, వీళ్లలోనైనా ఎంతమందిపై నేరారోపణలు రుజువయ్యాయంటే- చెప్పకొంటే సిగ్గుచేటు! రైల్వే బోర్డు రిక్రూట్‌మెంట్ పరీక్షలో అవకతవకలకు సంబంధించిన రెండు కేసుల్లోనే 18మందికే శిక్షలు ఖరారయ్యాయి. పోనీ, దోషులుగా తేలిన వాళ్లు అయినా ప్రస్తుతం కటకటాల వెనక ఉన్నారని అనుకుంటే అదీ అమాయకత్వమే అవుతుంది. ఒక కేసులో అహ్మదాబాద్‌లోని సీబీఐ కోర్టు నేరం జరిగిన ఇరవై మూడేళ్ల తరవాత ఐదుగురికి శిక్షలు విధించింది. కానీ, వారంతా ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. ఆ కేసు గుజరాత్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. మరో ఉదంతంలో పది మందికి హైదరాబాద్ సీబీఐ కోర్టు పద్నాలుగేళ్ల అనంతరం శిక్షలు ఖరారు చేస్తే- వాళ్లలో కీలక నిందితుడికి తరవాత బెయిల్ లభించింది. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందన్నట్లు, 2006 నాటి రైల్వే గ్రూప్-డి పరీక్ష లీకేజీలో ఇద్దరు నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఏకంగా ఎమ్మెల్యేలు అయిపోయారు. మన దగ్గర చట్టాలు ఎంతగా చట్టుబండలు అవుతున్నాయో చెప్పడానికి ఇంతకుమించి సాక్ష్యమేమి కావాలి?

దేశవ్యాప్తంగా 2014-24 మధ్య కేంద్ర సంస్థలు, పలు రాష్ట్ర విభాగాలు నిర్వహించిన 89 పరీక్షలు వివాదాలమయం అయ్యాయి. వాటన్నింటి మూలంగా ఆరున్నర కోట్ల మంది విద్యార్థులు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆరేళ్లకాలంలో 11 పేపర్లు లీక్ అయ్యాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో తొమ్మిది చొప్పున, మహారాష్ట్రలో ఆరు, గుజరాత్‌లో అయిదు పరీక్షలు అభ్యర్థుల భవితవ్యాన్ని సుడిగుండంలోకి నెట్టాయి. ఒకవైపు దేశవ్యాప్తంగా 'నీట్'పై నిరసనలు వెల్లువెత్తిన తరుణంలోనే మహారాష్ట్రలో టీచర్ల అర్హత పరీక్ష (టెట్) ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలతో ఎగ్జామ్ వాయిదా పడింది. పోయిన ఆదివారం పంజాబ్‌లో నిర్వహించిన ఫార్మసీ ఆఫీసర్ ఎంపిక పరీక్షలోనూ మోసాలు బయటపడ్డాయి. ఎన్ని నేరాలు చేసినా చట్టాలు తమను ఏమీ చేయలేవన్న ధీమాతోనే పాపిష్టి ముఠాలు ఇంతగా చెలరేగిపోతున్నాయి. దానివల్ల వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సడలిపోతోంది.

పేపర్ లీకేజీల్లో అధికశాతం కేసులు ఏళ్ల తరబడి విచారణ దశలోనే మగ్గుతున్నాయి. నిందితులు అజాపజా లేరంటూ దర్యాప్తు సంస్థలు కొన్ని కేసులను పక్కనపెట్టేస్తున్నాయి. మరికొన్నింటిని శాశ్వతంగా మూసేస్తున్నాయి. 'నీట్' రద్దుపై విద్యార్థిలోకం ఒకవైపు భారీగా ఆందోళన చేస్తుంటే- రెండేళ్ల క్రితం అదే పేపర్ లీకేజీలో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజీవ్ ముఖియాకు సీబీఐ మొన్న గురువారం క్లీన్‌చిట్ ఇచ్చింది. అతగాడు అమాయకుడైతే మరి ఆ పేపర్ బయటికి రావడానికి గూడుపుఠాణీ చేసిందెవరు? ఆ నిజాన్ని ఎవరు తేల్చాలి? ఇలా కేసులకు వరసగా చెదలుపడుతున్న కొద్దీ పేపర్ల లీకేజీలు పరిపాటిగా మారిపోతున్నాయి! నేటి పోటీ ప్రపంచంలో ఒక ఉ ద్యోగమో, నచ్చిన కోర్సులో సీటో తెచ్చుకోవడం అంత తేలికేమీ కాదు. అరకొరగా సీట్లు ఉండే ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీటుకోసం అభ్యర్థులు ఎంతో కష్టపడతారు. పరీక్షల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు వారి ఆశలను కాలరాసి, తీవ్ర నిరాశా నిస్పృహల్లోకి నెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల నీట్ యూజీ పరీక్ష రద్దు తర్వాత దేశవ్యాప్తంగా పలువురు పిల్లలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. నిజాయతీగా పరీక్షలకు సిద్ధమైనవారు ఇలా నానా అవస్థల పాలవుతుంటే- ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల తగిన సామర్థ్యం, అర్హతలు లేకున్నా డాక్టర్లు, ఇంజినీర్ల అవతారమెత్తే వారివల్ల ప్రజల ప్రాణాలే ప్రమాదంలో పడతాయి. అలాంటివారు దేశాభివృద్ధికే వేరుపురుగుల్లా మారతారు. ప్రభుత్వాలు ఈ సత్యాన్ని గుర్తించి ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో దోషులకు వేగంగా శిక్షలు పడేలా చూడాలి!

# కుట్ర సిద్ధాంతాలకు కాలం చెల్లింది!

**ఢిల్లీ అధికార కారిడార్లలో కుట్ర సిద్ధాంతాలు నిరంతరం వినిపిస్తూనే ఉంటాయి. నేటి రాజకీయ భారతంలో అవి గుసగుసల కంటే బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు అవి రాజకీయ ఆయుధాలుగా పరిణమించాయి. దేశ రాజధానిని కుదిపేసిన విద్యార్థుల నిరసనలతో సంబంధమున్న సోనమ్ వాంగ్‌చుక్, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సభ్యులు తాజా కుట్ర సిద్ధాంతాలకు లక్ష్యాలుగా ఉన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, తగ్గిపోతున్న ఉద్యోగావకాశాలు, నియామకాల్లో జాప్యాలపై లక్షలాది యువ భారతీయులు ఎందుకంతగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారో అర్థం చేసుకోకుండా, వారి ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారి ఉద్దేశాలను ప్రశ్నించేందుకే రాజకీయ పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి. వాంగ్‌చుక్, సీజేపీలు మోదీ ప్రభుత్వ 'రహస్య రాజ్య వ్యవస్థ' (డీప్ స్టేట్)లో భాగమే అని కాంగ్రెస్ శ్రేణుల్లో బాగా ప్రచారంలో ఉన్న ఒక సిద్ధాంతం చెబుతోంది. 'నీట్' పరీక్షల గందరగోళంపై ప్రజ్వరిల్లిన ఆందోళనల నుంచి రాజకీయలబ్ధి పొందకుండా కాంగ్రెస్‌ను నివారించేందుకే వాంగ్‌చుక్, సీజేపీని మోదీ సర్కార్ 'డీప్ స్టేట్' రంగంలోకి దించిందనేది ఆ సిద్ధాంత సారాంశం. ఇదొక అసాధారణ వాదన. దీనికి సాక్ష్యాధారాలు ఏవీ లేవు. అయితే వాస్తవాల కంటే అనుమానాలే మహా వేగంగా విస్తరిల్లి, వర్ధిల్లే వర్తమాన యుగంలో కుట్ర సిద్ధాంతాల శీఘ్రగతిన బాగా ప్రభావదాయక మవుతున్నాయి.**



లద్దాఖ్‌కు మరింత స్వతంత్ర ప్రతిపత్తి నివ్వాలని డిమాండ్ చేస్తూ ఆ హిమాలయ ప్రాంతవాసులు ఏడాది క్రితం నిర్వహించిన ఆందోళనలో హింసాత్మక ఘటనలు సంభవించాయి. వాటికి సోనమ్ వాంగ్‌చుక్ బాధ్యుడు అనే ఆరోపణతో ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఆరు నెలలపాటు జైలు నిర్బంధంలో ఉన్న తరువాత విడుదల చేశారు. అరెస్ట్ చేయడానికి కారణాలు ఏమిటో ప్రభుత్వం చెప్పనే లేదు. వాంగ్‌చుక్ జైలులో ఉన్న సమయంలో బీజేపీ సామాజిక మాధ్యమాలలో ఆయనను విదేశీ నిధులు పొందుతున్న 'జాతి వ్యతిరేకి'గా చిత్రించారు. 'చైనా ఏజెంట్' అని కూడా ఆరోపించారు. తమ రాజకీయ కథనాలను సమర్థించుకోవడానికి వాంగ్‌చుక్ ఉపన్యాసాల నుంచి ఎంపిక చేసిన భాగాలను ఉటంకించారు. ఇప్పుడు అదే వ్యక్తిని ఇంటెలిజెన్స్ బ్యూరో చేతుల్లో కీలుబొమ్మ అని కాంగ్రెస్ శ్రేణులు నిందిస్తున్నాయి. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటం, రాహుల్‌గాంధీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వాంగ్‌చుక్‌ను ఉపయోగించుకుంటున్నారని ప్రధాన ప్రతిపక్షం ఆరోపిస్తోంది. 'చైనా ఏజెంట్'గా ఆరోపణలకు గురైన వ్యక్తి భారత ప్రభుత్వ ఏజెంట్‌గా ఎలా పరిణమించాడు? తమ నీడను చూసి జడుసుకునే రాజకీయవాదుల భయానుమానాలలోని అసంబద్ధతను వాంగ్‌చుక్‌పై ఈ నిందలు బహిర్గతం చేస్తున్నాయి.

వాంగ్‌చుక్ నాకు రెండు దశాబ్దాలుగా తెలుసు. విద్యా రంగం, పర్యావరణ పరిరక్షణల్లో ప్రశస్త కృషికి గాను 2008లో సీఎన్‌ఎన్-ఐబీఎన్ వార్తా సంస్థ వాంగ్‌చుక్‌ను 'రియల్ హీరో'గా గౌరవించి సత్కరించిన సందర్భంలో నేను ఆయనను మొదటిసారి కలుసుకున్నాను. ఆనాటి సభలో నటుడు ఆమిర్‌ఖాన్ కూడా ఉన్నారు. ఆ తరువాత ఆయన నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమా వాంగ్‌చుక్ జీవితం నుంచి స్ఫూర్తి పొందినట్టుగా ప్రచారం జరిగింది. విద్యారంగంలో మౌలిక మార్పులకు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తికి, లద్దాఖ్ భవిష్యత్తుకు వాంగ్‌చుక్ చేస్తున్న కృషిని నేను చాలా సంవత్సరాలుగా గమనిస్తూ వస్తున్నాను. వాంగ్‌చుక్ ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డు గ్రహీత. గతంలో అన్ని రాజకీయ పార్టీలు సమున్నతంగా గౌరవించిన వ్యక్తి, ఇప్పుడు ఎవరు మాట్లాడుతున్నారు అన్నదానిపై ఆధారపడి ఆయన దేశద్రోహిగానో లేక ప్రభుత్వ ఏజెంట్‌గానో ఎలా అయ్యారు? మోదీ ప్రభుత్వం సైతం ఆయనను పలుమార్లు బహిరంగంగా ప్రశంసించింది. మార్చి 2023లో వాంగ్‌చుక్, ఆయన సతీమణితో సమావేశమైన తరువాత వారితో తాను దిగిన ఫొటో నొకదాన్ని ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వివిధ రంగాలలో ఆ దంపతులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. మూడు సంవత్సరాల తరువాత నీట్ వివాదంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకు గాను వాంగ్‌చుక్‌పై బీజేపీ నాయకుల గౌరవభావం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. వాంగ్‌చుక్ లేవనెత్తిన ప్రశ్నలపై చర్చించడానికి బదులుగా ఆయన ఉద్దేశాలను అనుమానిస్తున్నారు.

మరొక ఉదంతాన్నీ కూడా ప్రస్తావించవలసి ఉన్నది. 'లేహ్ అటానమస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్' వాంగ్‌చుక్ ఆధ్వర్యంలోని హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్‌కు 1000 కనాల్స్ (8 కనాల్‌లు ఒక ఎకరానికి సమానం) భూమిని కౌలుకు ఇచ్చింది. ఆ తరువాత ఆ కౌలును రద్దు చేసింది. లద్దాఖ్ స్వతంత్ర ప్రతిపత్తి ఉద్యమంలో వాంగ్‌చుక్ కీలకపాత్ర వహిస్తున్న కారణంగానే ఈ రద్దు జరిగిందన్నది స్పష్టం. భిన్నాభిప్రాయ వ్యక్తీకరణను ప్రజాస్వామిక స్వేచ్ఛగా కాకుండా ఒక విరోధ చర్యగా పరిగణించడం వల్లే ఇలా జరిగింది. ప్రభుత్వ నిర్ణయాలతో విభేదించిన వారు బెదిరింపులు, వ్యక్తిత్వ హననాలకు గురవుతున్నారు. మోదీ ప్రభుత్వం మొదటి నుంచీ ఇలానే వ్యవహరిస్తోంది. పాత్రికేయులు, విద్యావేత్తలు, పౌర సమాజ కార్యకర్తలు అందరూ ఈ ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతూనే ఉన్నారు.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని మోదీ సర్కార్ తొలుత నెలలపాటు పూర్తిగా ఉపేక్షించింది. సీజేపీ కార్యకర్తల నిరసన ఉధృతమైన తరువాతనే దాని ఉనికిని అంగీకరించడం సర్కార్‌కు అనివార్యమయింది. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే, సీజేపీ అనేది ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక పరోక్ష ప్రతినిధి మాత్రమే. కారణం దాని స్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆప్ సోషల్ మీడియాలో పనిచేయడమే! 2011లో అన్నాహజారే ఉద్యమం నుంచే ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభవించి, యూపీఏ ప్రభుత్వ పతనాన్ని వేగవంతం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ను ఇప్పటికీ బాధిస్తూనే ఉన్నది. అయితే చరిత్ర ఒక బందీఖానా కాకూడదన్న వివేకాన్ని చూపకపోతే ఎలా?

సీజేపీ కార్యకర్తలు పలువురితో నేను సంభాషించాను. పార్టీ రాజకీయాలు కాకుండా వ్యవస్థ పట్ల అసంతృప్తే వారి తిరుగుబాటుకు ప్రేరణ. ఈ 'జనతా' వాదులు అనుభవ శూన్యులు, అయితే.. ఆదర్శవాదులు. అప్పుడప్పుడు అవ్యవస్థితులు, అయితే.. కపటరహిత రాజకీయులు. తాము ఎందుకు ఈ ఆందోళనకు పూనుకున్నామని వారు నిర్మొహమాటంగా చెబుతున్నదాన్ని వినడం కంటే- ఏదో ఒక రాజకీయ పార్టీ ఏజెంట్లు అని కొట్టివేయడం చాలా తేలిక. అసలు ఈ నిర్లక్ష్య వైఖరే ఒక పెద్ద విషాదం.

పన్నెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోతోంది. అసమ్మతిని పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం లేదని లేదా దానిని అణచివేయవచ్చని విశ్వసిస్తోంది. విమర్శకులను విరోధులుగా, నిరసనకారులను కుట్రదారులుగా చూస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిని బలహీనపరిచేందుకు విదేశీ శక్తులతో కుమ్మక్కయినవారు చేస్తోన్న మరో ప్రయత్నమే సీజేపీ అని ప్రభుత్వం భావిస్తోంది.

తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న యువతపై రాజకీయ నిందారోపణలు చేయడం రాజకీయపక్షాలకు తగదు. కుట్రసిద్ధాంతాలలో పావులుగా వారిని పరిగణించకూడదు. అంతకంటే మెరుగైన విషయాలకు యువ భారతీయులు అర్హులు. ప్రశ్న పత్రాల లీక్‌కు కారణాలు ఏమిటో వారికి స్పష్టంగా వివరించాలి. ఉద్యోగ నియామకాల్లో జాప్యం ఎందుకు జరుగుతుందో చెప్పాలి. క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరచనున్నారో స్పష్టంచేయాలి. తగ్గిపోతున్న ఉద్యోగావకాశాల విషయమై సంజాయిషీ చెప్పాలి. తమ ఆకాంక్షలను వినే ప్రభుత్వాలు, తమకు నాయకత్వం వహించే ప్రతిపక్షాలు యువభారతీయులకు అవసరం. మరీ ముఖ్యంగా తమ ధర్మాగ్రహాన్ని, ఆందోళనలను శంకించకుండా సహానుభూతితో ప్రతిస్పందించే రాజకీయవేత్తలు, రాజకీయ వాతావరణం వారికి అవసరం.

అవినీతి, అసమర్థ పాలనపై నిందలను తోసిపుచ్చేందుకు అధికార పక్షాలు కుట్ర సిద్ధాంతాలు చేయడం పరిపాటి. ప్రజల నిరసనలను రహస్య అజెండాల దృక్కోణంలో చూడడం కాకుండా, ఆ ఆందోళనలు లేవనెత్తిన ఇబ్బందికర ప్రశ్నలను అధికారంలో ఉన్నవారు, అధికారానికి ఆరాటపడుతున్నవారు ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నప్పుడే ప్రజాస్వామ్యాలు వర్ధిల్లుతాయి. శాంతియుత నిరసనలను కుట్రగా పరిగణించడం మానుకోవాలి. రాజకీయపక్షాలు మరింత జవాబుదారీతనం చూపాలి. ప్రభుత్వాలు నిర్మాణాత్మక సంస్కరణలతో పారదర్శక పాలననందించాలి. యువ భారతీయ పౌరుల జీవితోన్నతికి ఇవి అవసరం. వాటికి వారు అర్హులు. అంతకంటే అల్పమైన వాటిని వారు ఇంకెంత మాత్రం సహించరు.

# నెరవేరని అమెరికా అభీష్టం!

**ఒక దేశం తన ప్రత్యర్థిపై గట్టిగా దాడి చేసి, లక్ష్యాలను ధ్వంసం చేసి, విజయం సాధించామని చెప్పకోవచ్చు. కానీ తన అభీష్టాన్ని, సంకల్పాన్ని అమలు చేయడంలో విఫలం కావచ్చు. అమెరికా-ఇరాన్ యుద్ధం తాత్కాలికంగా ఆగినా అమెరికా నిజంగా తన అభీష్టాన్ని నెరవేర్చుకోగలిగిందా అన్నది ప్రశ్న! అలా జరగలేదు కాబట్టే మళ్లీ దాడులు మొదలుపెట్టింది. స్థిరమైన శాంతి ఒప్పందం కోసం చర్చలు కొనసాగుతాయని సూచించింది. జూన్ మధ్యలో వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణకు అవగాహన కుదరడం, ఆపైన 60 రోజుల రోడ్‌మ్యాప్‌పై అంగీకారానికి రావడం చూసి, ఇరాన్ యుద్ధం ముగిసిందనే ఆశ కలిగింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ దెబ్బతిన్నా, ఆ దేశం లొంగిపోలేదు. టెహ్రాన్ ప్రతిఘటన చర్చలకు దారితీసింది. యుద్ధం ప్రపంచాన్ని సురక్షితంగా మార్చకపోగా మరింత అనిశ్చితంగా మార్చింది. అమెరికా ఇప్పటికీ తిరుగులేని సైనిక శక్తే. అది నిరాటంకంగా ఎవరిపైనైనా దాడి చేయగలదు, శిక్షించగలదు, నిరోధించగలదు. అయినప్పటికీ తన సంకల్పాన్ని అమలు చేయలేకపోతోంది. ఇరాన్ విషయంలో తన అభీష్టాన్ని నెరవేర్చుకోలేకపోతోంది. పైగా ఇదివరకటికన్నా మరింత కఠినమైన పరిమితుల్లో పనిచేయాల్సి వస్తోంది. ఇరాన్ తన పట్టును నిలుపుకోవడానికి భౌగోళిక అనుకూలతలను, క్షిపణులు, డ్రోన్లు, హౌతీ వంటి విధేయ వర్గాలను, హర్మూజ్ ద్వారా ఇంధన సరఫరాకు అడ్డంకులు సృష్టించే సత్తాను ఉపయోగించుకుంది. అవసరమైతే ఎంత దూరమైనా వెళ్తానని, యుద్ధాన్ని మరింత ప్రజ్వరిల్లజేయగలననీ చాటుకుంది. ఆ వ్యూహం పనిచేయడం వల్లనే అమెరికా దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న తర్వాత కూడా చర్చలకు ఆహ్వానం పొందగలిగింది.**



'ఆపరేషన్ సిందూర్' నేర్పుతున్నదేంటి?

పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారత్ దాడి చేసింది. ఈ 'ఆపరేషన్ సిందూర్' పకడ్బందీ గూఢచర్య సమాచారం, రాజకీయ దృఢ సంకల్పం, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల మేళవింపుగా నిలిచింది. సరిహద్దుకు అవతల ఉన్నంతమాత్రాన ఉగ్రవాద స్థావరాలు తన దాడుల నుంచి తప్పించుకోలేవని భారత్ గట్టి సంకేతం ఇచ్చింది. అయినప్పటికీ పాకిస్థాన్ ఉగ్రదాడులకు బాధ్యతను అంగీకరించలేదు. తన గడ్డ పైనున్న ఉగ్రవాద వ్యవస్థను నిర్మూలించలేదు. పైగా మొండి వాదనలకు దిగింది. తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసింది. కాల్పుల విరమణ జరిగిన తర్వాత, 'ఆపరేషన్ సిందూర్'ను తట్టుకుని నిలబడటాన్ని తన విజయంగా చిత్రీకరించుకుంది. ఏతావాతా 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్‌ను శిక్షించిందే కానీ, ఆ దేశాన్ని పూర్తిగా లొంగదీయలేదు. ఆ శిక్ష నొప్పిని కలిగించిందే తప్ప పాక్ ప్రవర్తనను మార్చలేదు.

సాధారణంగా సైనిక విజయం కొన్ని కారణాల వల్ల రాజకీయ ఫలితంగా మారలేకపోవచ్చు. ఇరాన్ అమెరికాకు దీటైనది కాదు, పాకిస్థాన్ భారత్‌తో సరితూగలేదు. అయినప్పటికీ, యుద్ధాన్ని ఉద్ధృతం చేయడం అమెరికా, భారత్‌లకు తీవ్ర వ్యయప్రయాసలను కలిగించగలవు. ఇరాన్ హర్మూజ్‌ను మూసివేస్తానని బెదిరించగలదు, హౌతీ, హెజ్‌బొల్లా, హమాస్ వంటి అనుయాయ వర్గాలతో దాడులు చేయించగలదు. పాకిస్థాన్ అణ్వస్త్రాలను ప్రయోగిస్తానంటూ తాటాకు చప్పుళ్లు చేయగలదు. ఉగ్రవాదుల్ని రెచ్చగొట్టగలదు, దౌత్యపరంగా ప్రమాద సంకేతాలు వ్యాపింపజేయగలదు. దాడుల్లో నష్టపోయిన పక్షం, కిందపడ్డా తనదే పైచేయి అనడానికి సమాచార యుద్ధాన్ని ఉపయోగించుకుంటుంది. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తే వాటికి ప్రతీకారంగా ఖతార్, ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిపింది. దాంతో ఇంధన మార్కెట్లు, ప్రపంచ నౌకాయానం అతలాకుతలమయ్యాయి. పాకిస్థాన్, ఖతార్‌లు మధ్యవర్తి పాత్రలో పాల్గొన్నాయి. 'ఆపరేషన్ సిందూర్' కూడా రెండు అణ్వాయుధ దేశాల మధ్య జరగడం వల్ల ఇతర దేశాల దృష్టిని ఆకర్షించింది. యుద్ధ విరమణ కోసం బాహ్యశక్తుల ఒత్తిడి వల్ల సైనిక చర్యతో ఆశించిన రాజకీయ ప్రభావం పూర్తిగా సిద్ధించకపోవచ్చు. ఇంధన కొరతతో సతమతమైన ప్రపంచం హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవాలని కోరుకుంది. చమురు మార్కెట్లు స్థిరత్వాన్ని, గల్ఫ్ దేశాలు ప్రశాంతతను కోరుకున్నాయి. ఇలా అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో అమెరికా, ఇరాన్‌లు కాల్పుల విరమణకు దిగిరావాల్సి వచ్చింది. కానీ, అది నిలబడలేదు.

భారత్ గ్రహించాల్సిన విషయాలివీ...

ప్రస్తుత పరిస్థితుల్లో సైనిక శక్తి అవసరమేనని భారత్ గ్రహించాలి. ఆ శక్తిని నిర్దిష్ట భౌగోళిక రాజకీయ లక్ష్యాల సాధనకు వాడాలి. లక్ష్యం శిక్షించడమే అయితే ఉగ్రవాద శిబిరాలు, వారి ప్రాయోజకులపై విరుచుకుపడాలి. దాడులు పునరావృతం చేస్తే భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ప్రత్యర్థికి తెలియాలి. లక్ష్యం అంతరాయం కలిగించడం అయితే మందుగుండు గిడ్డంగులు, డ్రోన్‌లాంచ్ సైట్లు, కమ్యూనికేషన్, రవాణా కేంద్రాలు, శిక్షణ మౌలిక సదుపాయాలపై విరుచుకుపడాలి. వాటిని ఉగ్రవాదులు వాడకుండా నిరోధించాలి. లక్ష్యం శత్రువుపై ఆధిపత్యం సాధించడమైతే మొదటి అడుగు వేసే ముందే రెండో అడుగు గురించి కూడా ఆలోచించి పెట్టుకోవాలి. దౌత్య మద్దతునూ కూడగట్టాలి. ఎదుటిపక్షం దురాగతాలకు సాక్ష్యాలను త్వరగా విడుదల చేయాలి. దీర్ఘకాలంలో శత్రువు ప్రవర్తనలో మార్పు తీసుకురావడమే లక్ష్యమైతే ఒక దాడితో సరిపోదు. పదేపదే దెబ్బకొట్టాలి. ఎప్పటికప్పుడు గూఢచర్య సమాచారం సేకరించాలి. ఆర్థిక ఒత్తిడి, సరిహద్దు నియంత్రణ పెంచాలి. దౌత్యపరంగా ప్రత్యర్థిని ఏకాకిని చేయాలి. సమాచార యుద్ధంలో పైచేయిని నిలబెట్టుకోవాలి. సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధను శక్తిమంతంగా ఉపయోగించాలి. కంటెంట్ కోసం నిరంతరం అన్వేషించే సోషల్ మీడియా వాతావరణంలో భారత్ విశ్వసనీయ సాక్ష్యాధారాలతో కూడిన సమాచారాన్ని ప్రపంచం ముందుంచాలి. దాడి తర్వాత ధ్వంసమైన వాటిని చూపాలి. పాకిస్థాన్‌కు చైనా గూఢచర్య సమాచారం, పరికరాలు, దౌత్య మద్దతు, సాంకేతిక సహాయం అందిస్తూనే ఉంటే భవిష్యత్తులో త్రికోణ పోరుకు సిద్ధం కావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎవరు ఎవరిపై గట్టిగా దాడి చేశారనే దానికంటే ఎవరు ఆశించిన రాజకీయ ప్రయోజనాన్ని సాధించారన్నదే ముఖ్యం.

# ముప్పు ముంగిట్లో తీర ప్రాంతాలు!

కట్టుతప్పుతున్న భూతాపం కారణంగా ధ్రువప్రాంతాల్లో మంచు కరిగిపోయి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తుపానులు తీవ్రరూపు దాలుస్తున్నాయి. ఆకస్మిక వరదలు విరుచుకుపడుతున్నాయి. సంద్రంలోకి నదులు తెచ్చే ఇసుకను ఆనకట్టలు అడ్డుకుంటున్నాయి. మడ అడవులు నాశనమైపోతున్నాయి. పర్యావరణ పరంగా సున్నితమైన ప్రదేశాల్లోనూ ఇసుక తవ్వకాలు, ప్రణాళికారహిత నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వీటన్నింటి మూలంగా చాలా చోట్ల తీర ప్రాంతం కోతకు గురవుతూ ఎంతోమంది జీవితాలను కల్లోలంలోకి నెడుతోంది. ఇటీవల కేంద్రం పార్లమెంట్‌కు ఇచ్చిన సమాచారం ప్రకారం, 19902022 మధ్యకాలంలో భారతదేశ తీరప్రాంతంలో 34శాతానికి పైగా కోతకు గురైంది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 60.5శాతం మేర తీరం కడలిపాలైతే కేరళలో దాదాపు 44శాతం, తమిళనాడులో 39.2శాతం, గుజరాత్‌లో 31.2శాతం, ఒడిశాలో 28.3శాతం మేర అది తెగ్గోసుకుపోయింది. తాజా వివరాల మేరకు ఏపీలో దాదాపు 32శాతం తీర ప్రాంతంలో అదే దుస్థితి నెలకొంది. కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో యాభై శాతానికి పైగా తీర ప్రాంతం రూపం కోల్పోతే కృష్ణా, నెల్లూరు, శ్రీకాకుళం, కోనసీమ, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సముద్రం ఇలా చొచ్చుకొచ్చేస్తుండటంతో సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో సమస్యలు చుట్టుముడుతున్నాయి!

ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టాలు ఏటా సగటున 3.6 నుంచి 4.5 మిల్లీమీటర్ల చొప్పున పెరుగుతున్నాయి. జాతీయ సాగర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కాయిస్) శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం ఈ శతాబ్దం చివరి నాటికి ఇండియాలో అవి గరిష్ఠంగా 1.12 మీటర్ల మేర అధికమయ్యే అవకాశముంది. భారత్‌కు 11వేల కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతం ఉంది. సముద్రం ముందుకొస్తూ కొద్దికొద్దిగా సమీప భూభాగాన్ని మింగేస్తుండటం వల్ల రాబోయే రోజుల్లో దేశీయంగా 35కోట్ల మందిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముంది. విశాఖపట్నం, ముంబయి, చెన్నై, కొచ్చి తదితర నగరాలకు ముంపు ముప్పు సైతం పొంచి ఉంది. పశ్చిమంతో పోలిస్తే తుపానుల తాకిడి ఎక్కువగా ఉండటంతో తూర్పు తీరం అధికంగా కోతకు గురవుతోంది. ఆ ప్రాంతంలో ఇప్పటికే 180 చదరపు కిలోమీటర్లకు పైగా భూభాగం కడలిలో కలిసిపోయింది. తీరంలో ఉద్ధృతమవుతున్న కోత కారణంగా ఏపీలో 706 గ్రామాలు, ఎనిమిది పట్టణాలు ముంపు ముంగిట్లో ఉన్నాయని ఇన్‌కాయిస్ గతంలోనే హెచ్చరించింది. కాకినాడ సమీపంలోని ఉప్పాడ, కేరళలోని చెల్లనం, తమిళనాడులోని ముట్టమ్ వంటివెన్నో అలల ప్రతాపానికి తల్లడిల్లుతున్నాయి. తీర ప్రాంత జనజీవనాన్ని భయం గుప్పిట్లోకి నెడుతున్న ఈ విపత్తు తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వాలు కంకణబద్ధం కావాల్సిన తరుణమిది!

సముద్రపు నీరు పోటెత్తడం వల్ల భూగర్భ జలాల లవణీయత పెరిగి తాగు, సాగు నీటి సమస్యలు ముమ్మరిస్తాయి. పంట భూములు పనికిరాకుండా పోతాయి. సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్న లక్షల కుటుంబాల ఆవాసాలు, వారి జీవనోపాధులు దెబ్బతింటాయి. దూసుకొచ్చే అలలు స్థానిక మౌలిక వసతులనూ నాశనం చేస్తాయి. తీరప్రాంత కోత, అక్కడ సంభవించే వరదల వల్ల ఇండియా ఏటా 500 కోట్ల డాలర్ల మేర నష్టపోతున్నట్లు అంచనా. ఈ దుర్భర పరిస్థితులను నివారించాలంటే కర్బన ఉద్గారాలను వీలైనంతగా తగ్గించాలి. తీరాలకు సహజ రక్షణ కవచాలుగా నిలిచే మడ అడవులను విస్తృతంగా పెంచాలి. ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలి. భూ వినియోగం, నిర్మాణాలు తదితరాలకు సంబంధించిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. సముద్రం అడుగున రాతి దిబ్బల ఏర్పాటు, జియోట్యూబ్ సాంకేతికతతో రక్షణ గోడ నిర్మాణం ద్వారానూ కెరటాల ప్రకోపాన్ని తగ్గించవచ్చు. ఈ మేరకు నిపుణుల సూచనలను ఆచరణలోకి తేవడంలో ప్రభుత్వాలు ఇక ఆలస్యం చేయకూడదు!

ఆదివారం | రంగారెడ్డి
09.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# వైసీపీ నేరగాళ్ల ముఠా

(మొదటిపేజీ తరువాయి)

సొంత పార్టీ కార్యకర్తలను సైతం బలిపెడుతున్న నేరగాళ్ల ముఠా వైసీపీ అని తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వైసీపీని పునాదులతో సహా భూస్థాపితం చేయాలని ప్రజలకు మంత్రి సవిత పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. పరిశ్రమలను ఆహ్వానిస్తూ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ భావితరాల భవిష్యత్తుకు బంగారు పునాదులు వేస్తున్నారన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు ఊరికే రావని, సీఎం చంద్రబాబు విజన్, నమ్మకమైన పాలన వల్లే పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి తరలొస్తున్నారని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులు నిర్మిస్తూనే.. ఒకవైపు 'రైజింగ్ రాయలసీమ', మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి సవిత తెలిపారు.

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం**

గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మంత్రి సవిత మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్, సంపూర్ణ మద్యపాన నిషేధం, రూ.3 వేల పెన్షన్ అంటూ ప్రజలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. వచ్చేవారిని బెదిరించి, ఉన్న పరిశ్రమలను తరిమేసి రాష్ట్రాన్ని దశాబ్దాల వెనక్కి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచిందన్నారు. హత్యా రాజకీయం, విధ్వంసం, దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పాలన సాగించింది. బడుగు, బలహీన వర్గాలు, దళితులపై దౌర్జన్యాలు చేస్తూ రాష్ట్రాన్ని భూస్థాపితం చేశారని మండిపడ్డారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రానికి స్పష్టమైన రాజధాని ఉండాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుందని నమ్మి కూటమికి సంపూర్ణ మెజారిటీ కట్టబెట్టారన్నారు. ప్రజలు ఏ ఆశతోనైతే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారో, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి సవిత వెల్లడించారు.



**బీసీలను గుండెల్లో పెట్టుకుంటున్నాం**

బడుగు, బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్మోహన్ రెడ్డి వాడుకున్నారన్నారని మంత్రి సవిత మండిపడ్డారు. నాటి మహానాయకుడు నందమూరి తారక రామారావు కాలం నుంచి నేటి లోకేష్ వరకు టీడీపీ ఎల్లప్పుడూ బలహీన వర్గాలను గుండెల్లో పెట్టుకుని ఆదుకుంటోందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనకు, ఈ రెండేళ్ల కూటమి సుపరిపాలనకు తేడాను ప్రజలు గమనిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్రం పరుగులు పెడుతోంది. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందిస్తున్నాం.

**జగన్ కు సొంత పార్టీ కార్యకర్తలే పావులు...**

శవయాత్రలు, పాదయాత్రల పేరుతో జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ కార్యకర్తలనే బలి తీసుకునేలా రెచ్చగొడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి సొంత రాజకీయ లబ్ధి కోసం, కుర్చీ కాపాడుకోవడం కోసం ఎంతటికైనా తెగిస్తారన్నారు. వైసీపీ కార్యకర్తలు ఈ విషయాన్ని గ్రహించి అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం మతాలకు, ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. వైసీపీ కార్యకర్తలు ఒక్కసారి ఆలోచించుకోవాలి. మీరు పాము పడగ కింద ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. రాజకీయ ప్రయోజనాల కోసం కార్యకర్తలను వాడుకోవడం జగన్ కు అలవాటుగా మారిందన్నారు. వైసీపీ అంతర్గత విభేదాలతో జయవర్ధన్ రెడ్డి, ఇబ్రహీంపట్నంలో భార్గవ్, రాంబాబు, కడపలో జగన్ మేనమామ చేతుల్లో దస్తగిరి, మాచర్లలో పిన్నెల్లి వెంకట్రామరెడ్డి ముఠా చేతిలో చెన్నారెడ్డి బలయ్యారన్నారు. వివేకానంద రెడ్డి హత్య విషయం అందరికంటే ముందే జగన్‌కే తెలుసని వైఎస్ సునీత ఆనాడే తెలిపారన్నారు. అధికారం కోసం సొంత బాబాయినైనా, నమ్ముకున్న కార్యకర్తనైనా బలి తీసుకోవడానికి వైసీపీ వెనుకాడదని ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు.

**టజగన్ రెడ్డి పని అయిపోయినట్లేనా...?**

వైసీపీ అనేది ఒక రాజకీయ పార్టీ కాదని, అది నేరస్తుల ముఠా అని మంత్రి సవిత మండిపడ్డారు. పలాసాలో పేద గొర్రెల కాపరి, నిరుపేద కుటుంబానికి చెందిన దానయ్య యాదవ్‌ను పొట్టనబెట్టుకుంటే, ఆ కుటుంబాన్ని జగన్ పరామర్శించలేదన్నారు. పైగా హంతకులను కలిసి భరోసా ఇస్తున్నారన్నారు. 'చనిపోయిన వ్యక్తికి 44 ఏళ్లు దాటాయంటూ జగన్ అపహాస్యం చేయడం సరికాదన్నారు. వైఎస్ అవినాష్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, అంబటి రాంబాబు, జోగి రమేష్ వయసెంత..మీ వయస్సు అయిపోయింది కదా... మీ పని అయిపోయినట్లేనా.. కుర్చీ ఎక్కడానికి, పదవులు అనుభవించడానికి మీ వయసులు సరిపోతాయా' అని ప్రశ్నించారు. చనిపోయిన వ్యక్తికి 44 ఏళ్లు అని చిన్నచూపు చూస్తూ, నిందితులను కాపాడేందుకు ప్రయత్నించడం బీసీ, బడుగు, బలహీన వర్గాల పట్ల జగన్‌కున్న అసలైన నైజానికి నిదర్శనమని బయటపడిందన్నారు. జగన్ శ్రీకాకుళం పర్యటనలో వైసీపీ నేత చింత రవి ఏకంగా విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా పోలీసుపైనే దౌర్జన్యానికి పాల్పడితే, మాజీ మంత్రి అంబటి రాంబాబు చట్టాన్ని గేలిచేస్తూ పోలీసులపై నిత్యమూ దాడికి దిగుతున్నారన్నాని మంత్రి సవిత మండిపడ్డారు.

**గొడ్డలి పార్టీని భూస్థాపితం చేయండి**

బడుగు, బలహీన వర్గాలు అన్ని రంగాల్లో ఎదగడానికి తెలుగుదేశం పార్టీయే పునాది వేసిందని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ రెండేళ్లలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి వేగవంతంగా సాగుతున్నాయన్నారు. వైసీపీ రెచ్చగొట్టే రాజకీయాలను బడుగు వర్గాలు తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి వల్లే నేడు దేశంలోనే అత్యధికంగా పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలివస్తున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఎక్కువగా లబ్ధి పొందేది బడుగు, బలహీన వర్గాల యువతేనని తెలిపారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం పెట్టిన మొదటి సంతకం మెగా డిఎస్సీపైనే. కుల మతాలకు అతీతంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఈ మెగా డిఎస్సీ ద్వారా వేలాది మంది బీసీ, నిరుపేద నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించి లబ్ధి పొందారన్నారు. రాష్ట్ర భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే, అలజడులు రేపే గొడ్డలి పార్టీని ప్రజలంతా కలిసి శాశ్వతంగా భూస్థాపితం చేయాలని మంత్రిసవిత పిలుపునిచ్చారు.

## ఐఫోన్లు దోచేశారు
## విలువ సుమారు రూ.2 కోట్ల మేర




తిరుపతి, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్

తిరుపతి పట్టణంలోని సోనోవిజన్ ఎలక్ట్రానిక్ షాపులో భారీ దొంగతనం జరిగింది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న సోనోవిజన్ షాపులోకి ఓ దొంగ.. శుక్రవారం అర్ధరాత్రి ప్రవేశించాడు. గోడకు కన్నమేసి లోనికి దూరిన దొంగ.. షాపులోని 50 యాపిల్ ఐఫోన్లు సహా ఇతర కంపెనీలకు చెందిన 200 మొబైల్ ఫోన్ల వరకూ చోరీ చేశారు. పలు ఎలక్ట్రానిక్ వస్తువులను ఎత్తుకెళ్లారు. శనివారం రోజు ఉదయం షాపు తెరిచిన నిర్వాహకులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు.. చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు.ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

మరోవైపు సోనోవిజన్ షాపు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ టీవీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. షాపులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో ఓ వ్యక్తి మాస్కు వేసుకుని లోనికి ప్రవేశించిన దృశ్యాలు నమోదయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 2 గంటల సమయంలో ఈ చోరీ జరిగినట్లు సీసీ ఫుటేజీ ఆధారంగా తెలుస్తోంది. మరోవైపు షాపులో చోరీకి గురైన వస్తువుల విలువ సుమారుగా రూ. 2 కోట్లు ఉంటుందని షాపు నిర్వాహకులు చెప్తున్నారు. మరోవైపు శుక్రవారం రాత్రి ఒంటి గంట 20 నిమిషాల సమయంలో గునపంతో భవనం గోడకు కన్నమేసి దొంగ షాపు లోనికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. ఎలక్ట్రానిక్ షాపులో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది నెల కింద పని మానేశారని.. అప్పటి నుంచి సెక్యూరిటీని నియమించుకోలేదని వెల్లడించారు. షాపు నిర్వాహకుల నుంచి కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని పోలీసులు తెలిపారు. ఓ వ్యక్తి మాస్కు వేసుకుని లోనికి ప్రవేశించినట్లు సీసీ ఫుటేజీలో కనిపించిందని.. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నామని, వీలైనంత త్వరగా చోరీ చేసిన వారిని అరెస్ట్ చేస్తామని పోలీసులు వెల్లడించారు.

**మంగాపురంలో వాచ్‌మెన్‌ను హత్య చేసిన దుండగులు..**

మరోవైపు తాళంబేడు గ్రామపంచాయతీలోని మంగాపురంలో ఆనందరావు అనే వాచ్‌మెన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఆనందరావును గొంతు కోసి హత్య చేసిన ఆగంతకులు.. ఇంట్లోకి ప్రవేశించేందుకు ఇంటి అద్దంపై నాటుబాంబు కూడా విసిరారు. అయితే ఇంట్లో నివసిస్తున్నవారు గట్టిగా కేకలు వేయడంతో అక్కడినుంచి పారిపోయారు. అనంతరం ఇంటి సభ్యులు.. వాచ్‌మెన్‌ను పిలిచినా స్పందన లేకపోవటంతో షెడ్‌లోకి వెళ్లి చూడగా ఆనందరావును హత్య చేసిన విషయం తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యం



న్యూఢిల్లీ, ఆగస్టు 08, అనంత జనశక్తి న్యూస్

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భారతీయ జనతా పార్టీ , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యమని, వారి నుంచి కాంగ్రెస్ పార్టీ దేశభక్తి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్ నాయకులెవరూ దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లలేదని ఖర్గే విమర్శించారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లి ఉంటే, వారు గతంలో కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత మారిన వారే తప్ప అసలైన బీజేపీ/ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు కారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే కాకుండా, ప్రజాస్వామ్యాన్ని రక్షించిందని, కాంగ్రెస్ నాయకులే నిజమైన దేశభక్తులని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని కొనియాడారు. బీజేపీ నాయకుల్లా కాకుండా, రాహుల్ గాంధీ స్వయంగా ప్రజల్లోకి వెళ్తూ యువకులు, రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ఆగస్టు 8న మహాత్మా గాంధీ ప్రారంభించిన 'క్విట్ ఇండియా'(1942) ఉద్యమాన్ని ఖర్గే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో దేశ ప్రజలంతా ఏకమై బ్రిటిష్ పాలనను పారద్రోలారని అన్నారు. దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్ సైనికుల త్యాగాలను ఆయన ప్రశంసించారు. కుమావూన్, గర్వాల్ రెజిమెంట్ల ప్రాముఖ్యాన్ని, తొలి పరమ్ వీర్ చక్ర గ్రహీతను స్మరించుకుంటూ, ఉత్తరాఖండ్ ప్రజలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఇవాళ జరిగిన ఈ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల బరిలో తమ స్వాతంత్ర్య పోరాట చరిత్రను, రాజ్యాంగ పరిరక్షణను ప్రధాన అస్త్రాలుగా మలచుకుని ముందుకు సాగుతోంది.

## నిరుద్యోగులను గౌరవించండి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? అని నిలదీశారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో "క్రిమినల్ వేస్ట్" అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే "యథా రాజా.. తథా అధికారులు" అన్న సామెత గుర్తుకొస్తోందన్నారు.

**ఆ హామీ ఏమైంది..?**

అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు? అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 32 నెలలు దాటింది, ఆ హామీ ఏమైంది? రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? అని ప్రశ్నించారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్, నీ జాబ్ క్యాలెండర్ బోగస్, నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్ అని మండిపడ్డారు. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడు.

**గౌరవించడం నేర్చుకోండి..**

నిరుద్యోగులు మీపై జాలి అడగడం లేదు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారు. ఉద్యోగం అడగడం నేరం కాదు. ప్రశ్నించడం నేరం కాదు.ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదు. ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




# ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

"ఐఐటీ ఢిల్లీ గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది. ఇప్పుడు చదువు పూర్తిచేసుకుని మీరు (విద్యార్థులు) అడుగుపెట్టే బయటి ప్రపంచం చాలా వేగంగా మారుతోంది. సాంకేతికత దగ్గర్నుంచి అనేక రంగాల్లో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే 2030 ఏళ్లలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండాలి. నిత్య విద్యార్థిలా నేర్చుకోవాలి. అలాంటి వారే విజేతలుగా నిలుస్తారు" అని మోదీ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు.

## ప్రశ్నించడం మాత్రమే కాదు..

**"మార్పు అనేది సవాళ్లు, అవకాశాలతో కూడుకుని ఉంటుంది. జీవితం మనకు ఎన్నో సమస్యలు తీసుకొస్తుంది. కానీ, ఆ సమస్యలే అవకాశాలు కల్పిస్తాయి. మీకు పెద్ద సవాలు ఎదురైనప్పుడు దాన్ని చూసి భయపడకండి. దాన్ని చిన్న చిన్న భాగాలుగా విడదీసి చూడండి. కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యమే సవాళ్లను అవకాశాలుగా మార్చగలదు. అందుకే, ప్రశ్నించడం కాదు.. సమస్యకు పరిష్కారం కనుగొనడంపై దృష్టిపెట్టాలి" అని మోదీ సూచించారు.**



**"ప్రతి తరానికి జాతీయ బాధ్యత ఉంటుంది. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కూడా భాగస్వామి కావాలి. వచ్చే 30-35 ఏళ్లలో మీరు ఏం చేస్తున్నారన్నదే.. వికసిత్ భారత్‌ను నిర్ణయిస్తుంది. అందువల్ల మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా సరే.. ఈ దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనేది ఆలోచించాలి. దేశ ప్రయోజనాల కోసం మనం ఏం చేయగలమనేది ప్రశ్నించుకోవాలి" అని ప్రధాని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను ప్రదానం చేశారు. పతకాలు స్వీకరించిన వారిలో ఒకరిద్దరే మహిళలు ఉన్నారని, వీరి సంఖ్య ఎక్కువగా ఉంటే బాగుండేదని మోదీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన 'పరం ప్రజ్ఞ'ను ఆయన ప్రారంభించారు.**

## డేటింగ్ యాప్‌లతో వల
# హనీట్రాప్‌లతో బ్లాక్‌మెయిల్





**- కోట్లు దోచేస్తోన్న కి'లేడీ'**
**- ప్రయాగ్‌రాజ్‌కు చెందిన పల్లవి సింగ్ రాజ్‌పుత్**

న్యూఢిల్లీ, అనంతజనశక్తి

డేటింగ్ యాప్ 'టిండర్', ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా పురుషులకు వలవేసి, అనంతరం వారి వ్యక్తిగత ఫోటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ కోట్ల రూపాయాలు గుంజినట్లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మహిళపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ప్రయాగ్‌రాజ్‌లో సాగుతున్న ఈ హనీట్రాప్, దోపిడీ నెట్‌వర్క్‌పై అలహాబాద్ హైకోర్టు న్యాయవాది ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ఆయన ఫిర్యాదు ప్రకారం.. పల్లవి సింగ్ రాజ్‌పుత్ అనే మహిళ డేటింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా పురుషులతో పరిచయం పెంచుకునేది. మొదట సాధారణ స్నేహంగా ప్రారంభమైన సంభాషణలు, ఆ తర్వాత సన్నిహిత సంబంధాలకు దారితీసేవి. బాధితులతో కలిసిన సమయంలో వారికి తెలియకుండా లేదా సన్నిహితంగా ఉన్న సమయాల్లో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించేది. ఆ తర్వాత ఆ వీడియోలను చూపిస్తూ బాధితులను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించేది. అడిగినంత డబ్బు ఇవ్వకపోతే రేప్, హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు పెడతానని బెదిరించేది. ఇప్పటివరకు ఆమె పలువురు నుంచి రూ. 6 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సదరు మహిళ పెట్టిన కేసుల కారణంగా ఇప్పటికే ఐదుగురు వ్యక్తులు జైలుకు వెళ్లినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. ఈ ముఠా కేసుల బెదిరింపులు, సమాజంలో పరువు తీస్తామనే భయాందోళనలను ఆసరాగా చేసుకుని బాధితుల నుంచి డబ్బులు గుంజినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఫోటోలో మంచంపై భారీగా కరెన్సీ నోట్ల కట్టలు పేర్చి ఉండగా, మరొక ఫోటోలో సదరు మహిళ పిస్టల్ పట్టుకుని కనిపిస్తోంది. అయితే, ఈ ఫోటోల నిజానిజాలు, అవి ఎప్పటివి అనేది ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది.

అంతేకాకుండా, కొత్త వ్యక్తులకు వల వేయడానికి ఈ మహిళ 'స్వీటీ తివారీ' వంటి రకరకాల పేర్లతో సోషల్ మీడియా ఖాతాలను నిర్వహించినట్లు మరొక ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెట్‌వర్క్‌లో పల్లవి సింగ్ రాజ్‌పుత్‌తో పాటు మరో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు భాగస్వాములుగా ఉన్నారని భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు ప్రస్తుతం పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నారు.

## పోర్చుగల్‌లో ఉద్యోగం పేరుతో..
# రూ. 11 లక్షలు కాజేసి

**—నాగ్‌పూర్ మహిళను బీర్ షాపు ఓనర్‌కు అమ్మేశారు!**

న్యూఢిల్లీ, అనంతజనశక్తి

విదేశాల్లో భారీ వేతనంతో కూడిన ఉద్యోగం ఇప్పిస్తామని నాగ్‌పూర్ మహిళను నమ్మించిన పుణేకు చెందిన ఓ సంస్థ ఆమె నుంచి రూ. 11 లక్షలు వసూలు చేసింది. అనంతరం ఆమెను పోర్చుగల్‌కు అక్రమంగా తరలించి, అక్కడ ఓ బీర్ షాపు యజమానికి విక్రయించినట్టు ఆరోపణలు వచ్చాయి. గత నెలలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పుణేలోని 'వి మైగ్రేట్' అనే కన్సల్టెన్సీ గురించి తెలుసుకుంది. ఈ ఏడాది జనవరి 24న వారిని సంప్రదించగా.. 'లెక్స్ మైగ్రేట్ కమ్యూనిటీ 3' అనే వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. ఫిబ్రవరి 14న తన భర్త, అత్తతో కలిసి పుణేలోని 'వి మైగ్రేట్' కార్యాలయానికి వెళ్లింది. పోర్చుగల్‌లో నెలకు రూ. 1.5 లక్షల భారీ జీతంతో క్యాషియర్ ఉద్యోగం ఇప్పిస్తామని, రోజుకు కేవలం ఎనిమిది గంటలు మాత్రమే పని చేయాల్సి ఉంటుందని నిర్వాహకులు నమ్మబలికారు. తాము గతంలో పంపామని చెప్పి ముగ్గురు వ్యక్తులతో మాట్లాడించారు. మూడు నెలల తర్వాత డిపెండెంట్ వీసాపై భర్తను పిలిపించుకోవచ్చని చెప్పారు.

వీసా, ఇతర పత్రాల ప్రక్రియ పేరుతో ఆమె నుంచి విడతల వారీగా మొత్తం రూ. 11 లక్షలు వసూలు




చేశారు కేటుగాళ్లు. ఆ మహిళను పోర్చుగల్‌కు తీసుకెళ్లారు. అక్కడ విమానం దిగగానే ఆమె పాస్‌పోర్ట్‌ను ఏజెంట్లు లాక్కొని, రెండు రోజుల పాటు ఒక గదిలో బంధించారు. ఆ తర్వాత ఒక బీర్ షాప్ యజమానికి ఆమె విక్రయించారు. అక్కడ ఆమెతో బలవంతంగా పనిచేయించడమే కాకుండా తీవ్రమైన మానసిక, శారీరక హింసకు గురిచేశారు.

ఒకానొక సమయంలో బాధితురాలు తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వమని మోసగాళ్లను అడిగింది, కానీ వారు ఆమె నుంచి మరింత డబ్బు డిమాండ్ చేశారు. దాదాపు నెల రోజుల పాటు చిత్రహింసలను భరించిన తర్వాత, చివరకు తప్పించుకునే ఉపాయం కనుగొంది. మొదట బస్సులో లిస్బన్‌కు పారిపోయి, ఆ తర్వాత అక్కడి నుంచి స్పెయిన్‌లో మాడ్రిడ్‌కు... అనంతరం దోహా మీదుగా భారత్‌కు తిరిగి రాగలిగింది. భారత్‌కు చేరుకున్న ఆమెకు మాల్టాలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసగాళ్లు మరో రూ. 3 లక్షలు డిమాండ్ చేశారు. అందుకు నిరాకరించడంతో ఆమె భర్తను చంపుతామని, ఆమెపై తప్పుడు కేసులు పెడతామని బెదిరింపులకు దిగారు. తీవ్ర నిరాశకు గురైన ఆ మహిళ పుణే పోలీసులను ఆశ్రయించింది. 'వీ మైగ్రేట్' నిర్వాహకులతో సహా ఎనిమిది మంది నిందితులపై మానవ అక్రమ రవాణా, మోసం, దోపిడీ ఆరోపణలపై ఈ వారం ప్రారంభంలో కేసు నమోదు చేశారని, గాలింపు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.



## రెంట్ బాయ్‌ఫ్రెండ్'

# ఆఫర్ల పేరుతో వల

- అమ్మాయిలూ జర జాగ్రత్త!
- సీపీ సజ్జనార్ హెచ్చరిక
- కేటుగాళ్లు విసురుతున్న కొత్త ట్రాప్

హైదరాబాద్, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్

"ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అదీ 50 శాతం డిస్కౌంట్ ఆఫర్లతో!".. సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఈ తరహా ఆకర్షణీయమైన పోస్టర్ల వెనుక ఒక పెద్ద సైబర్ మోసం దాగి ఉందనే విషయాన్ని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త రకం డేటింగ్ ట్రాప్ ఇది. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వేదికలుగా "ఫస్ట్ ఆగస్ట్ స్పెషల్ 50% ఆఫర్", "రెంట్ బాయ్‌ఫ్రెండ్ యువర్ పర్సనల్ కంపానియన్" అంటూ రకరకాల డిస్కౌంట్ ప్యాకేజీలతో కూడిన పోస్టర్లను నెట్టింట విపరీతంగా ప్రచారం చేస్తున్నారు.

కలర్‌ఫుల్ ప్యాకేజీలు.... అసలు మోసం ఇక్కడే!

ఏఐ (కృత్రిమ మేధ) సాయంతో సృష్టించినవి లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన హ్యాండ్సమ్ కుర్రాళ్ల ఫోటోలను ప్రదర్శిస్తూ పెద్ద ధరల పట్టికనే మీ ముందుకు తెస్తున్నారు. ఒక గంట కాఫీ మీటింగ్‌కు రూ.499, సినిమా డేట్‌కు రూ.1,249, షాపింగ్‌కు తోడుగా రావడానికి రూ.1,499, ఈవెంట్లు లేదా పెళ్లిళ్లకు తోడుగా వచ్చేందుకు రూ1,999, అలాగే 10 గంటల ఫుల్ డే ప్యాకేజీకి రూ.4,499 అంటూ కేటుగాళ్లు రేట్లు ఫిక్స్ చేస్తున్నారు. ఎవరికీ తెలియకుండా గోప్యత, భద్రత పాటిస్తామని..... ఇది ఎటువంటి అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతున్నారు.

మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. ఆపై బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేస్తారు. డబ్బులు అకౌంట్‌లో పడగానే సదరు ప్రొఫైళ్లను లేదా అకౌంట్లను పూర్తిగా బ్లాక్ చేస్తారు.

అంతటితో ఈ మోసం ఆగదు. ఆన్‌లైన్ సంభాషణలను నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని మరింత సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అంతేకాకుండా..... చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత తీవ్ర స్థాయిలో బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశమూ ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కఠిన చర్యలుంటాయి సీపీ సజ్జనార్

ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ప్రత్యేక దృష్టిసారించింది. వీటికి బాధ్యులైన వారిపై వేగవంతంగా దర్యాప్తు చేపట్టి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటు వారి తల్లిదండ్రులు కూడా అత్యంత అప్రమత్తంగా ఉండాలి. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు..? బయటకు వెళ్లినప్పుడు ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై నిరంతరం నిఘా ఉంచాలి. స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై సరియైన పర్యవేక్షణ లేకపోతే అమాయక పిల్లలు కేటుగాళ్ల వలలో పడే ప్రమాదం ఉంది.

కేటుగాళ్లు ఇచ్చే ఆకర్షణీయమైన డిస్కౌంట్ ఆఫర్లను చూసి ఎవరూ మోసపోకూడదు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం కానీ, నేరుగా కలవడం కానీ చేయవద్దు. ముందస్తుగా రూపాయి కూడా చెల్లించకూడదు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారిన పడినా.... లేదా సోషల్ మీడియాలో అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే భయపడకుండా వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేయండి లేదా http://cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# అల్పపీడనం ఎఫెక్ట్

- తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన
- బలమైన గాలులు వీచే ఛాన్స్!
- మోస్తరు నుంచి భారీ వర్షా లు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 08, అనంతజనశక్తి న్యూస్

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితుల్లో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నైరుతి బెంగాల్ మహాసముద్రం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (ఆగస్టు 8, 2026) ఉదయం 08:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఎత్తుకు వెళ్లేకొద్దీ ఇది నైరుతి దిశగా వంగి ఉందని ఐఎండీ వివరించింది. ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశల నుంచి గాలులు వీస్తున్నట్లు పేర్కొంది.

ఈ అల్పపీడన ప్రభావంతో రాగల ఐదు రోజుల పాటు (ఆగస్టు 8 నుండి ఆగస్టు 12 వరకు) ఆంధ్రప్రదేశ్, యానాం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు కనిపిస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

ఉత్తర కోస్తా : ఈ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే ప్రమాదం ఉందని తెలిపారు.

దక్షిణ కోస్తాంధ్ర & రాయలసీమ : ఇక్కడ కూడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. తీరప్రాంతాలతో పాటు రాయలసీమ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశముంది.

తెలంగాణ వెదర్ రిపోర్ట్ :

తెలంగాణలో రాబోయే ఆరు రోజుల పాటు (ఆగస్టు 8 నుండి ఆగస్టు 14 వరకు) సాధారణ వాతావరణ సూచనలు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఎలాంటి తీవ్రమైన వాతావరణ హెచ్చరికలు లేవని స్పష్టం చేసింది.

మరికొన్ని గంటల్లో హైదరాబాద్, భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్, మేడ్చల్, మంచిర్యాల, మహబూబ్ నగర్, మెదక్, నాగర్ కర్నూల్, నల్గొండ, నారాయణపేట, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, వికారాబాద్, వనపర్తి, భువనగిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం పడొచ్చు.



# ఆర్టీసీ డ్రైవర్లపై పనిభారం తగ్గించాలి

- విధుల ఒత్తిడితో డ్రైవర్ల సతమతం
- విశ్రాంతికి సమయం లేక ఇబ్బందులు
- అదనపు డ్యూటీలతో ఆరోగ్యంపై ప్రభావం
- ఖాళీలను భర్తీ చేసి పనిభారం తగ్గించాలి
- డ్యూటీ వేళలను క్రమబద్ధీకరించాలి
- డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- ప్రభుత్వమే చొరవ చూపాలంటున్న డ్రైవర్లు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 8, అనంత జనశక్తి న్యూస్



తెలంగాణ ఆర్టీసీలో డ్రైవర్ల పరిస్థితి రోజురోజుకూ భారంగా మారుతోంది. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించే డ్రైవర్లపై పనిభారం పెరుగుతోంది. డ్రైవర్ల కొరత కారణంగా ఉన్న సిబ్బందిపైనే అదనపు డ్యూటీల భారం పడుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది. రోజువారీ విధుల్లో ఎక్కువ సమయం బస్సులు నడపాల్సి రావడంతో డ్రైవర్లు తీవ్ర అలసటకు గురవుతున్నారు. డ్యూటీల మధ్య తగిన విశ్రాంతి లభించకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. దీంతో డ్రైవర్ల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా డ్రైవర్లకు తగిన విశ్రాంతి కల్పించాల్సిన అవసరం ఉంది. అయితే సిబ్బంది కొరత కారణంగా ఆర్టీసీ డిపోలలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని చెబుతున్నారు. ఒకవైపు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండగా మరోవైపు డ్రైవర్ల సంఖ్యకు అనుగుణంగా నియామకాలు జరగడం లేదని వాపోతున్నారు. దీంతో ఉన్న సిబ్బందిపైనే అదనపు బాధ్యతలు పడుతున్నాయి. ప్రస్తుతం అమలవుతున్న డ్యూటీ విధానాన్ని పునఃపరిశీలించాలని డ్రైవర్లు కోరుతున్నారు. డ్యూటీలను క్రమబద్ధీకరించి పని గంటలను నియంత్రించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదనపు డ్యూటీల విషయంలో స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని కోరుతున్నారు. డ్రైవర్లకు సమయానికి విశ్రాంతి, భోజన విరామాలు కల్పించాలని సూచిస్తున్నారు. డిపోల వారీగా ఉన్న సిబ్బంది కొరతను గుర్తించి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల భద్రతకు డ్రైవర్ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత ఎంతో కీలకమని అంటున్నారు. అలసటతో వాహనం నడపాల్సిన పరిస్థితులు రోడ్డు భద్రతకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఆర్టీసీ సంస్థ ప్రయోజనాలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికీ ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. డ్రైవర్ల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డిపో మేనేజర్లు డ్రైవర్లతో సమావేశాలు నిర్వహించి సమస్యలను నమోదు చేయాలని సూచిస్తున్నారు. విధుల కేటాయింపులో పారదర్శకత పాటించాలని కోరుతున్నారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అంటున్నారు. డ్రైవర్లపై అనవసరమైన ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే విధుల ఒత్తిడితో అనేక మంది డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. వారి సమస్యలను కేవలం ఉద్యోగుల సమస్యగా కాకుండా ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశంగా చూడాలని కోరుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి డ్రైవర్ల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఖాళీల భర్తీ, డ్యూటీల క్రమబద్ధీకరణ, విశ్రాంతి సమయాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వం కూడా డ్రైవర్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డ్రైవర్లపై పనిభారం తగ్గితేనే ప్రయాణికులకు మరింత సురక్షితమైన సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఆర్టీసీ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# సాగు ప్రణాళిక అమలు చేయాలి : కలెక్టర్ అంకిత్

- ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచాలి
- తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత..
- నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలి
- చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలి

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జులై 8 అనంత జనశక్తి న్యూస్




వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా సంసిద్ధత సమావేశంలో జిల్లాలోని నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.

జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు భంగం కలగకుండా సాగునీటి వినియోగంలో శాఖల మధ్య సమన్వయం పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 2,384 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా, 598 చెరువులు 0-25 శాతం, 965 చెరువులు 25-50 శాతం, 587 చెరువులు 50-75 శాతం, 207 చెరువులు 75-100 శాతం నీటితో నిండాయి. మరో 27 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 209 చెరువులకు గాను 13 చెరువులు 0-25 శాతం, 129 చెరువులు 25-50 శాతం, 72 చెరువులు 50-75 శాతం, 6 చెరువులు 75-100 శాతం నీటితో నిండగా, 2 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. *అశ్వారావుపేట నియోజకవర్గంలో 759 చెరువులకు గాను 271 చెరువులు 0-25 శాతం, 273 చెరువులు 25-50 శాతం, 76 చెరువులు 50-75 శాతం, 66 చెరువులు 75-100 శాతం నీటితో నిండగా, 23 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. ఇల్లందు నియోజకవర్గంలో 241 చెరువులకు గాను 132 చెరువులు 0-25 శాతం, 96 చెరువులు 25-50 శాతం, 7 చెరువులు 50-75 శాతం, ఒక చెరువు 75-100 శాతం నీటితో నిండగా, 5 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. పినపాక నియోజకవర్గంలో 802 చెరువులకు గాను 94 చెరువులు 0-25 శాతం, 315 చెరువులు 25-50 శాతం, 313 చెరువులు 50-75 శాతం, 79 చెరువులు 75-100 శాతం నీటితో నిండగా, ఒక చెరువు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉంది. భద్రాచలం నియోజకవర్గంలో 349 చెరువులకు గాను 26 చెరువులు 0-25 శాతం, 150 చెరువులు 25-50 శాతం, 124 చెరువులు 50-75 శాతం, 49 చెరువులు 75-100 శాతం నీటితో నిండాయి. మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని పరిశీలిస్తే తాలిపేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 73.68 మీటర్ల నీటి మట్టంతో 669 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు 24,700 ఎకరాలు కాగా స్పిల్‌వే ద్వారా నీరు బయటకు వెళ్తోంది. పెద్దవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 81.235 మీటర్లు కాగా, ప్రస్తుతం 75.235 మీటర్ల వద్ద 90.427 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ ఉంది. దీని ఆయకట్టు 2,360 ఎకరాలు. కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 124.08 మీటర్లు కాగా, ప్రస్తుతం 122.46 మీటర్ల నీటిమట్టంతో 6,950 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ ఉంది. దీని ఆయకట్టు 10,000 ఎకరాలు. జిల్లాలో 455.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 561.4 మి.మీ. తో పోలిస్తే 18.8 శాతం లోటు నమోదైంది. జూన్‌లో 4.3 శాతం, జూలైలో 31.8 శాతం లోటు నమోదవగా, ఆగస్టులో ఇప్పటివరకు సాధారణం కంటే 1.2 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది.

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు ప్రణాళికను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. సీజనల్ యాక్షన్ ప్లాన్‌లోని 4,86,048 ఎకరాల లక్ష్యానికి గాను 4,21,367 ఎకరాల్లో సాగు పూర్తై 86.69 శాతం సాధన నమోదైంది. ఇందులో పత్తి లక్ష్యం 2,19,000 ఎకరాలు కాగా 2,19,000 ఎకరాల్లో సాగై 100 శాతం సాధించింది. వరి లక్ష్యం 31,500 ఎకరాలు కాగా 70,652 ఎకరాల్లో సాగై 224.29 శాతం నమోదైంది. మొక్కజొన్న లక్ష్యం 1,08,500 ఎకరాలు కాగా 75,775 ఎకరాల్లో 69.84 శాతం, పెసర లక్ష్యం 12,500 ఎకరాలు కాగా 6,620 ఎకరాల్లో 52.96 శాతం, కంది లక్ష్యం 22,530 ఎకరాలు కాగా 2,916.23 ఎకరాల్లో 12.94 శాతం, మినుము లక్ష్యం 12,100 ఎకరాలు కాగా 324 ఎకరాల్లో 2.68 శాతం సాగైంది. జొన్న 2,000 ఎకరాల లక్ష్యానికి ఇప్పటివరకు సాగు నమోదు కాలేదు. ఆయిల్‌పామ్ లక్ష్యం 14,500 ఎకరాలు కాగా 3,516 ఎకరాల్లో 24.25 శాతం, సూర్యకాంతి లక్ష్యం 200 ఎకరాలు కాగా ఇప్పటివరకు సాగు లేదు. కూరగాయల లక్ష్యం 3,000 ఎకరాలు కాగా 680 ఎకరాల్లో 22.67 శాతం, ఇతర పంటల లక్ష్యం 60,218 ఎకరాలు కాగా 41,884 ఎకరాల్లో 69.55 శాతం సాగు నమోదైంది.

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గిస్తూ, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెసర, మినుము, కంది, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ** వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రాంతానుసారం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, తక్కువ నీటి వినియోగం, పంటల వైవిధ్యీకరణ, వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునే విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలోని ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రాధాన్యతను వివరించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. చెరువులు, బోర్‌వెల్స్‌పై అధికంగా ఆధారపడి వరి సాగు చేయడాన్ని నిరుత్సాహపరుస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రైజ్డ్ బెడ్ విధానం, నీటి సంరక్షణ, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, నేలలో తేమను సంరక్షించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 1,38,198 ఎకరాలను ప్రత్యామ్నాయ పంటల పరిధిలోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అన్ని క్లస్టర్లలో పెసర, మినుము, కంది వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. సాగునీటి ఆధారిత మొక్కజొన్న, పత్తి, వరి ప్రాంతాల్లో పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్‌పామ్ సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం, తాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచి పంట నష్టాల ప్రమాదాన్ని తగ్గించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత, సాగునీటి వినియోగంలో సమర్థత, పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయ పరిరక్షణ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశం లో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, సిపిఓ సునీత, మిషన్ భగీరథ ఈఈ లు నలిని, తిరుమలేష్, నీటిపారుదల శాఖ ఈ ఈ లు, డీఈలు వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం ధరలు పెంపు!

- డిస్టలరీల విజ్ఞప్తికి కమిటీ గ్రీన్‌సిగ్నల్
- 8 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం

హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్




తెలంగాణలో త్వరలోనే మద్యం ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. మద్యం తయారీ వ్యయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో తమకు చెల్లించే బేసిక్ ప్రైస్‌ను సవరించాలని డిస్టలరీలు ప్రభుత్వాన్ని కోరాయి. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన ఉన్నతస్థాయి ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ.. మద్యం ధరలను సుమారు 8 నుంచి 10 శాతం వరకు పెంచవచ్చని సిఫారసు చేస్తూ నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. దీనికి తోడు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ఎక్సైజ్ డ్యూటీని కూడా పెంచే అంశాన్ని అబ్కారీ శాఖ పరిశీలిస్తోంది. కరెంట్, రవాణా చార్జీలు, గ్లాస్ బాటిళ్లు, కార్టన్ బాక్సుల ధరలు పెరగడంతోపాటు మద్యం తయారీకి ఉపయోగించే రెక్టిఫైడ్ స్పిరిట్, ధాన్యాల వంటి ముడిసరుకుల వ్యయం కూడా పెరిగిందని డిస్టలరీలు ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకెళ్లాయి. కూలీల వేతనాలు పెరగడంతో పాత ధరలకే డిపోలకు మద్యం సరఫరా చేయడం కష్టంగా మారిందని, బేసిక్ ప్రైస్‌ను పెంచాలని కోరాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రైస్ ఫిక్సేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. డిస్టలరీల ప్రతిపాదనలు, ముడి సరుకుల ధరలు, తయారీ వ్యయాన్ని పరిశీలించిన కమిటీ.. సాధారణ ఐఎంఎఫ్ఎల్ బ్రాండ్లు, ప్రీమియం బ్రాండ్లు, బీర్ల కేటగిరీలను బట్టి 810 శాతం వరకు ధర సవరణ సమంజసమని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మద్యం ధరల పెంపుతోపాటు అదనపు ఎక్సైజ్ డ్యూటీ విధించే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఎక్సైజ్ సుంకాలను పరిశీలిస్తున్న అధికారులు.. తెలంగాణలో పన్నుల శ్లాబులను సవరించడం ద్వారా ప్రభుత్వానికి వచ్చే అదనపు ఆదాయాన్ని అంచనా వేస్తున్నారు.

మద్యం ధర నిర్ణయం తయారీదారుడి బేసిక్ ప్రైస్, ఎక్సైజ్ డ్యూటీ, స్పెషల్ ఎక్సైజ్ సెస్, వ్యాట్, టీఎస్‌బీసీఎల్ మార్జిన్, రిటైల్ వ్యాపారుల మార్జిన్ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. చివరిసారిగా 2022 మేలో మద్యం ధరలు పెరిగాయి. ఎక్సైజ్ డ్యూటీని 2020 మేలో కరోనా లాక్‌డౌన్ అనంతరం పెంచారు. ప్రస్తుతం అబ్కారీ శాఖ రెండు నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఒకటి ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ సూచించిన 810 శాతం ధరల పెంపు ప్రతిపాదన కాగా..

మరొకటి అదనపు ఎక్సైజ్ డ్యూటీ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపై ఆర్థిక అంచనాలు. ఈ రెండు ప్రతిపాదనలను త్వరలో ముఖ్యమంత్రి ఆమోదానికి పంపనున్నారు. సీఎం ఆమోదం లభిస్తే ధరల పెంపుపై అబ్కారీ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.





# మగవాళ్లకి కూడా బ్రెస్ట్ క్యాన్సర్ వస్తుందట, కారణాలు, లక్షణాలు, చికిత్స

సాధారణంగా రొమ్ము క్యాన్సర్ అనగానే మహిళలకు మాత్రమే పరిమితమైన సమస్య అని అందరూ భావిస్తారు. కానీ పురుషుల్లో కూడా అతి తక్కువ మందికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిని పురుషుల్లో హార్మోన్ల అసమతుల్యత కారణంగా ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు పెరగడం, అధిక బరువు, లివర్ వ్యాధులు దీనికి ప్రధాన కారణాలు అవుతున్నాయి. అంతే కాకుండా కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ ఉన్నా లేదా జన్యుపరమైన లోపాలు ఉన్న కూడా పురుషులు మరింత అప్రమత్తంగా ఉండాలి.



దురదృష్టవశాత్తు పురుషుల్లో ఈ వ్యాధిపై అవగాహన తక్కువగా ఉండటం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించలేకపోతున్నారు. అయితే ఈ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించడం వల్ల తగిత చికిత్స తీసుకుని ప్రాణపాయం నుంచి బయటపడొచ్చు. ఈ నేపథ్యంలో పురుషుల్లో బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు, కారణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స వంటి విషయాల గురించి వివరంగా తెలుసుకుందాం..





### ప్రధాన కారణాలు

పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం హార్మోన్ల అసమతుల్యత. టెస్టోస్టెరాన్ కంటే ఈస్ట్రోజెన్ స్థాయిలు ఎక్కువగా పెరగడం ఒక కారణం. అలాగే శరీరంలో కొవ్వు పెరగడం వల్ల హార్మోన్లలో మార్పులు రావడం, లివర్ వ్యాధులు, బీఆర్‌సీఏ వంటి జన్యుపరమైన సమస్యల వల్ల ముప్పు పెరుగుతుంది. అంతే కాకుండా మీ కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ ఉంటే అది పురుషులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

### ముఖ్యమైన లక్షణాలు

చాలా మంది పురుషులకు బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన లేకపోవడం వల్ల నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ఛాతీ భాగంలో నొప్పి లేని గడ్డలు లేదా వాపు ఉండటం, రొమ్ము చర్మం ఎర్రబడటం లేదా సొట్టలు పడటం, రొమ్ము బుడిపెల నుంచి స్రావాలు రావడం లేదా అది లోపలికి ముడుచుకుపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది.

### వ్యాధి నిర్ధారణ


పురుషుల్లో బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణకు శారీరక పరీక్షలతో పాటు మమ్మోగ్రఫీ, అల్ట్రాసౌండ్ వంటి ఇమేజింగ్ టెస్ట్‌లు చేస్తారు. అలాగే బయాప్సీ ద్వారా కూడా క్యాన్సర్‌ను నిర్ధారిస్తారు. లక్షణాలు, పరిస్థితిని బట్టి డాక్టర్ సూచిస్తారు.

### చికిత్స

అయితే వయసు పెరగడం, రేడియేషన్ ప్రభావం, మద్యం అలవాటు, హార్మోన్ల చికిత్సలు వంటివి క్యాన్సర్ ముప్పును పెంచుతాయి. అయితే క్యాన్సర్ ఏ దశలో ఉందనే దానిపై చికిత్స ఆధారపడి ఉంటుంది. సర్జరీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ వంటి చికిత్సలు అందిస్తారు. అయితే వీలైనంత తొందరగా వ్యాధిని గుర్తించడం చాలా ప్రధానం. ముఖ్యంగా పురుషుల్లో దీనిపై అవగాహన పెంచడం ద్వారా లక్షణాలను గుర్తించి సరైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.

# బియ్యం కడిగిన నీళ్లతో ముఖంపై మచ్చలు, మొటిమలు మాయం






ప్రకృతి మనకు ప్రసాదించిన సహజ వనరుల్లో మనకు తెలియని ఎన్నో సౌందర్య రహస్యాలు దాగి ఉన్నాయి. అలాంటి వాటిలో అత్యంత సహజమైన వనరుల్లో బియ్యం కడిగిన నీళ్లు కూడా ఒకటి. ఈ టిప్ అత్యంత పురాతనమైనది. మన అమ్మమ్మలు, నానమ్మల కాలం నుంచి వాడుకలో ఉన్నదే. కానీ నేటి ఆధునిక కాలంలో కూడా దీనికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. రసాయనాలు కలిసిన ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ కంటే మన వంటింట్లో లభించే సహజ సిద్ధమైన బియ్యం కడిగిన నీళ్లు ఎంతో మేలు చేస్తాయని రీసెర్చ్ గేట్ అధ్యయనం పేర్కొంది. ముఖ్యంగా జపాన్, కొరియా మహిళల మెరిసే స్కిన్ రహస్యం ఇదేనని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి.

### బియ్యం నీటితో ప్రయోజనాలు

బియ్యం నీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంపై రక్షణ కవచంలా పనిచేస్తూ పొల్యూషన్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తాయి. అలాగే వయసు పెరగడం వల్ల వచ్చే మార్పులను అరికట్టి చర్మాన్ని బిగుతుగా మార్చడంలో తోడ్పడుతాయి. చర్మాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి సహజమైన కాంతిని అందిస్తాయి. ఎండ వల్ల కలిగే ట్యాన్‌ని తగ్గించి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. జిడ్డు చర్మం కలిగిన వారికి ఇది అద్భుతమైన టోనర్‌లా పని చేస్తుంది. ముఖంపై రంధ్రాలను తగ్గించడంతో పాటు మొటిమలు, మచ్చలతో బాధపడేవారికి ఈ బియ్యం నీళ్లు మంచి మ్యాజిక్ వాటర్.







### రెండు రకాలుగా తయారు చేసుకోవచ్చు

ఈ బియ్యం నీటిని నానబెట్టడం, ఉడికించడం ద్వారా తయారు చేసుకోవచ్చు. ఒక అర కప్పు బియ్యాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని బాగా శుభ్రంగా కడగాలి. ఆ తర్వాత ఆ బియ్యంలో రెండు కప్పుల నీళ్లు పోసి సుమారు అరగంట పాటు నానబెట్టాలి. అనంతరం ఆ బియ్యం నానబెట్టిన నీటిని వేరే గిన్నెలోకి వంపుకోవాలి. అలాగే మరో పద్ధతి అంటే ఉడకబెట్టడం ద్వారా.. ఇక్కడ కూడా అర కప్పు బియ్యం తీసుకుని బాగా కడిగి.. అందులో రెండింతలు నీళ్లు పోసి గ్యాస్ మీద పెట్టాలి. బియ్యం బాగా ఉడుకుతున్నప్పుడు పైన ఉన్న నీటిని గరిట సాయంతో మరో గిన్నెలోకి తీసుకోవాలి.

### ఎలా అప్లయ్ చేయాలంటే

బియ్యం నీటిని ఒక గిన్నెలో తీసుకుని దూది సాయంతో ముఖానికి రాసుకోవాలి. అలాగే ముఖం కడుక్కోవడానికి నార్మల్ వాటర్ కంటే ఈ నీళ్లను ఉపయోగించవచ్చు. అలాగే ముల్తానీ మట్టి లేదా శనగ పిండి కలిపి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవచ్చు. అనంతరం 15 నిమిషాలు అలానే ఉంచి బాగా ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేసుకోవచ్చు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ బియ్యం కడిగిన నీళ్లు అందరికీ సరిపడకపోవచ్చు. ముఖ్యంగా సున్నితమైన చర్మం ఉన్న వాళ్లకు ఇది అలర్జీ కలిగించే అవకాశం ఉంది. కాబట్టి దీనిని ఉపయోగించాలి అనుకునేవాళ్లు మొదటి చేతిపై ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలి. అలాగే ఈ నీటిని ఫ్రిజ్‌లో దాచి రెండు మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదు. ఎప్పటికప్పుడు తయారు చేసుకుని ఫ్రెష్‌గా ఉపయోగించుకోవడం అత్యంత ఉత్తమం.

### ఆరోగ్యవంతమైన జుట్టు కోసం కూడా..

బియ్యం కడిగిన నీళ్లు జుట్టుకు అవసరమైన పోషకాలను కూడా అందించి జుట్టు బలంగా పెరగడంలో, మెరవడానికి తోడ్పడుతుంది. తలస్నానం చేసే సమయంలో బియ్యం నీళ్లను తలపై పోసి కుదుళ్లకు పట్టేలా మృదువుగా మసాజ్ చేయాలి. అలా కొన్ని నిమిషాల పాటు చేసిన తర్వాత శుభ్రంగా కడిగేయాలి. ఇలా వారంలో రెండు లేదా మూడు సార్లు చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయట.

అనంత జనశక్తి

ఆదివారం | రంగారెడ్డి 09.08.2026



# టూత్ బ్రష్ కొనివ్వలేదని.. కొడుకుపై తండ్రి కేసు



పళ్ల బ్రష్ కొనివ్వలేదని ఓ తండ్రి తన కొడుకుపై కేసు పెడితే.. ఆ తర్వాత ఏం జరిగిందనే ఆసక్తికర కథతో రూపొందిన చిత్రం 'పళ్ళబురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, గోమతి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 14న రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హీరో నాగార్జున ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈమేరకు ఈ సినిమా చిత్రీకరణ జరిగిన సిద్ధిపేట జిల్లాలోని లచ్చపేట ప్రజలకు కృతజ్ఞతలు చెబుతూ ఓ వీడియోను పంచుకున్నారు. టూత్ బ్రష్ కొనివ్వలేదని తన కొడుకుపై ఓ తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం.. ఆ తర్వాత నుంచి వాళ్లిద్దరి జీవితాల్లో చోటుచేసుకున్న పరిణామాలు.. వాళ్ల కుటుంబంలో చెలరేగిన అలజడిని ట్రైలర్‌లో మనసులకు హత్తుకునేలా చూపించారు. ప్రస్తుతం తల్లిదండ్రులకు - పిల్లలకు మధ్య ఉన్న అనుబంధాలు ఎలా మారుతున్నాయి.. కుటుంబ వ్యవస్థ ఎలా తయారవుతోంది అన్నది ఈ సినిమాలో ఓ తండ్రి కోణం నుంచి భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు అర్థమవుతోంది.

# ప్రియాంక రహస్య మిషన్



భాషతో సంబంధం లేకుండా చిత్రాల్ని ఎంచుకుంటూ, అవకాశం వచ్చినప్పడల్లా అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలకు హాజరవుతూ తీరిక లేకుండా గడుపుతోంది అందాల తార ప్రియాంక చోప్రా. ఈ మధ్యే 'ది బ్లఫ్' అనే యాక్షన్ చిత్రంతో అలరించిన ఆమె.. ఇప్పుడు ఓ సైన్స్ ఫిక్షన్ కథతో తెరపైకి రాబోతుంది. ప్రియాంక, హాలీవుడ్ నటుడు రస్సెల్ క్రో ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బ్లూఫ్లై'. 'స్ట్రేంజర్ థింగ్స్' ఫేమ్ నిమ్రోడ్ అంటాల్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. ఉనికిలో లేని ఓ విమానాన్ని తిరిగి తీసుకురావడానికి చేపట్టిన ఒక రహస్య మిషన్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని, ఈ ఏడాది ఆఖర్లో చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రియాంక.. మహేశ్ బాబుతో కలిసి 'వారణాసి' షూటింగ్‌లో ఉంది.

# జెండా పండగకు పోస్టర్ల సందడి

బాలీవుడ్ తారలు రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఈ సినిమా నుంచి క్యారెక్టర్ పోస్టర్లను విడుదల చేయనున్నట్లు సమాచారం. ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల ఆఖరి నాటికి పూర్తి కానుందని, వచ్చే ఏడాది జనవరి 22న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



## ఆసుపత్రి పాలైన అవికా గోర్.. 104 డిగ్రీల జ్వరంలోనూ

# షూటింగ్ చేసిన 'చిన్నారి పెళ్లికూతురు'

టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

---

# భూమి కావాలంటూ రిషభ్ పంత్ అర్ధరాత్రి పోస్టు.. స్పందించిన సీఎం




ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి భారత క్రికెటర్ రిషభ్ పంత్ ఓ అభ్యర్థన పెట్టుకున్నాడు. తన ఇంటి కోసం భూమిని కేటాయించాలని అర్ధరాత్రి సమయంలో సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పంత్ పేరిట ఉన్న ఎక్స్ ఖాతా నుంచే ఈ రిక్వెస్ట్ వెళ్లడం గమనార్హం. ఆ పోస్టుకు సీఎం ధామి కూడా బదులిచ్చారు. ప్రస్తుతం పంత్ శ్రీలంక పర్యటనలో ఉన్నాడు. ఇంతకీ పంత్ ఏమని పోస్టు పెట్టాడు.. సీఎం సమాధానం ఏంటంటే..?

"నమస్కారం సర్.. ఎలా ఉన్నారు. నేనూ ఉత్తరాఖండ్‌కు చెందిన వాడినే. అయితే, చాలా కాలంగా బయటే ఉంటున్నా. ఢిల్లీ నుంచి ఉత్తరాఖండ్‌కు వచ్చి స్థిరపడాలని భావిస్తున్నా. అందుకోసం అనువైన, విశాలమైన స్థలం కోసం మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నా. కానీ, నాకు సరైంది దొరకడం లేదు. మన రాష్ట్రమంటే నాకు చాలా ఇష్టం. భూమిని సమకూర్చడంలో నాకు సహాయం కావాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నా. గతంలో నాకు కేటాయించాల్సిన భూమి విషయం కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. నా సొంత ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అనుకుంటున్నా. దయ చేసి ఈ విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నా. మీ స్పందన కోసం ఎదురు చూస్తూ ఉంటా. అంతర్జాతీయ వేదికలపై మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినందుకు బహుమతిగా ఏదైనా ఇస్తే బాగుంటుంది. మీరు అనుమతిస్తే.. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కొనుగోలు చేయాలనుకుంటున్నా. దయచేసి సహాయం చేయండి" అని అర్ధరాత్రి 12.46 గంటలకు పంత్ ఖాతా నుంచి పోస్టులు వచ్చాయి.

# వైభవ్ సూర్యవంశీ స్పెషాలిటీ ఏంటి? సింపుల్‌గా చెప్పేసిన శిఖర్ ధావన్



చిన్న వయసులోనే పరిణతితో ఆడటం సాధారణ విషయం కాదని.. వైభవ్ సూర్యవంశీ చాలా స్పెషల్ అని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసించాడు. స్ట్రోక్ ప్లేతోపాటు నిర్భయంగా ఆడే మనస్తత్వం అతడి సొంతమని తెలిపాడు. 15 ఏళ్ల వయసులోనే స్టార్ బౌలర్లపైనా ఆధిపత్యం ప్రదర్శించడం అద్భుతమన్నాడు. "కేవలం దూకుడుగా ఆడటంతోనే వైభవ్ సూర్యవంశీ ) హైలైట్ కావడం లేదు. అతడిలో మరో ప్రత్యేకత కూడా ఉంది. ఎలాంటి షాట్‌నైనా మనసు పెట్టి ఆడతాడు. నైపుణ్యంతోపాటు ఇలాంటి అలవాటు ఉంటే అతడిని ఆపడం చాలా కష్టం. పిన్న వయసులోనే ఆ సత్తాను అందుకోవడం అభినందనీయం. అంతర్జాతీయ క్రికెట్‌లో 15 ఏళ్లకు అడుగు పెట్టడమే అతడు సాధించిన అతిపెద్ద ఘనత. ఐపీఎల్‌లోనూ ఫోర్లు, సిక్స్‌లు చాలా దూకుడుగా బాదేవాడు. ముమ్ముందు కూడా అతడి భవిష్యత్తు అద్భుతంగా ఉండబోతోంది" అని ధావన్ తెలిపాడు.

# సాయి సుదర్శన్ ఔట్.. పోటీలో ముగ్గురు.. ఎవరికి దక్కేనో ఛాన్స్



శ్రీలంకతో రెండు టెస్టుల ముంగిట టీమ్ఇండియాను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ గాయాల కారణంగా సిరీస్‌కు దూరమయ్యారు. తాజాగా సాయి సుదర్శన్ కూడా శ్రీలంకతో మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్న సుదర్శన్ కాలి వేలి గాయం నుంచి పూర్తిగా కోలుకోక పో వడంతో అతడిని సిరీస్‌ను నుంచి తప్పించారు. సుదర్శన్ స్థానంలో త్వరలో మరొకరిని సెలక్టర్లు ఎంపిక చేయ నున్నారు. సర్ఫరాజ్ ఖాన్, రుతు రాజ్ గైక్వాడ్, రజత్ పటిదార్ ప్రధానం గా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఈ ముగ్గురూ ఆగస్టు 23 నుంచి ప్రారంభం కా నున్న దులీప్ ట్రోఫీకి సిద్ధమవుతు న్నారు. రుతురాజ్ వెస్ట్‌జోన్ కెప్టెన్‌గా ఉండగా.. అదే జట్టుకు సర్ఫరాజ్ ఆడనున్నాడు. ఇక, మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పటిదార్ సెంట్రల్ జోన్‌కు సా రథ్యం వహించనున్నాడు. ఈ ముగ్గు రిలో ఒకరికి కచ్చితంగా భారత జట్టు నుంచి పిలుపు వచ్చే అవకాశముం దని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్.. ప్రపంచంలో తొలి స్పిన్నర్‌గా రికార్డు



అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో మూడుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేసిన తొలి స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. బ్రెడీ క్రికెట్ క్లబ్ వేదికగా ఐర్లాండ్‌తో శుక్రవారం రాత్రి జరిగిన రెండో వన్డేలో రషీద్ ఖాన్ (6/34) అదరగొట్టి

ఈ ఘనత అందుకున్నాడు. అంతకుముందు మార్చి 17, 2017న గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అఫ్గాన్ స్పిన్నర్ 9.3 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అలాగే, జూన్ 9, 2017న గ్రోస్ ఐస్లెట్‌లో వెస్టిండీస్‌పై 8.4 ఓవర్లలో 18 పరుగులే ఇచ్చి ఏకంగా ఏడు వికెట్లు తీశాడు.

స్పిన్నర్లయిన అజంత మెండిస్ (శ్రీలంక), వానిందు హసరంగ (శ్రీలంక), ఇమ్రాన్ తాహిర్ (సౌతాఫ్రికా), షాహిద్ అఫ్రిది (పాకిస్థాన్), అకిల ధనంజయ (శ్రీలంక), సందీప్ లామిచానే (నేపాల్) వన్డేల్లో రెండేసిసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేశారు. ఇప్పుడు వీరందరిని అధిగమించిన రషీద్ ఖాన్ కొత్త సృష్టించాడు. ఇక ఓవరాల్‌గా వన్డేల్లో అత్యధికసార్లు ఆరు వికెట్లు తీసిన రికార్డు పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ వకార్ యూనిస్ పేరిట ఉంది. అతడు తన కెరీర్‌లో మొత్తం ఐదుసార్లు ఆరు లేదా అంతకంటే వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమ ప్రదర్శన (7/36).

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945